# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :41 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 10-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## చైనాలో ఘోర అగ్నిప్రమాదం.. 20 మంది సజీవ దహనం


చైనాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ నర్సింగ్ హోమ్ లో మంటలు చెలరేగి 20 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటన హెబీ ప్రావిన్స్ లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. చైనా మీడియా నివేదికల ప్రకారం.. రాజధాని బీజింగ్‌కు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెంగ్డే నగరంలోని లాంగ్‌హువా కౌంటీ లో గల ఓ నర్సింగ్ హోమ్‌లో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో (స్థానిక కాలమానం ప్రకారం) భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటల ధాటికి అందులోని వారు సజీవదహనమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయానికి 20 మందిమృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. సుమారు 15 మందికిపైగా తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## వీర హనుమాన్ విజయ యాత్రకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు..



హైదరాబాద్, పీస్ కమిటీ సభ్యుల కారణంగా హైదరాబాద్ నగరంలో ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుగుతున్నాయని నగర పోలీస్ బాస్ సీవీ ఆనంద్ తెలిపారు. వారం రోజుల క్రితమే శ్రీరామ నవమి శోభ యాత్ర ప్రశాంతంగా జరిగింది.. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ.. విజయవంతంగా పూర్తి చేశాం.. ఇప్పుడు వీర హనుమాన్ విజయ యాత్రకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తాం.. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల నుంచి కూడా ఈ విజయ యాత్రలో పాల్గొంటారు.. సుమారు 12 కిలో మీటర్ల మేర ఈ యాత్ర కొనసాగనుంది.. సెన్సిటివ్ ఏరియాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటాం.. యాత్ర నిర్వాహకుల సహకారం కూడా ముఖ్యం అని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఇక, ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు బాధ్యత తీసుకొని, అందరిని సమన్వయం చేసుకుంటూ సాగాలని హైదరాబాద్ సీపీ ఆనంద్ చెప్పుకొచ్చారు. కొత్తవారు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.. 2010 తరువాత ఎప్పుడు గొడవలు జరగలేదు.. 2010 ముషీరాబాద్, మదన్న పేట్ లలో గొడవలు జరిగాయి.. అలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.. పోలీసులు, నిర్వాహకులతో అందుబాటులో ఉంటూ యాత్రను ముందుకు తీసుకెళ్తాం.. ఖర్మన్ ఘాట్ నుంచి యాత్ర త్వరగా బయలుదేరేలా సూచించాం.. యాత్ర శనివారం జరుగుతుంది.. రెండవ శనివారం కాబట్టి సెలవు ఉంటుంది.. ట్రాఫిక్ కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, యాత్ర నిర్వాహకులు సహకరించాలని సీవీ ఆనంద్ కోరారు. కాగా, బైబిల్ హౌస్ వద్ద రైల్వే బ్రిడ్జ్ దగ్గర గతంలో మాదిరిగా సమస్యలు రాకుండా వేరే మార్గంలో ముందుకు వెళ్లాలని సీపీ ఆనంద్ సూచించారు. అయితే, శ్రీ రామనవమి సందర్భంగా ఒక ఉల్లంఘన జరిగింది.. కాబట్టి, డీజే వల్ల కలిగే నష్టాలు అందరికి తెలుసు.. నిర్వాహకులు కూడా డీజే విషయంలో నిబంధనలకు అనుగుణంగా సహకరిస్తామన్నారు.. పెద్ద స్పీకర్లు పెట్టుకోవచ్చు కానీ డీజేలను మాత్రం అనుమతించము.. ఇక, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వీడియోలో పెట్టకూడదు.. వర్షం పడే అవకాశం ఉంది.. జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికపుడు సమన్వయం చేస్తూ ముందుకు సాగాలన్నారు. వాటర్ లాగిన్ పాయింట్స్ కు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి.. అలాగే, రాచకొండ పోలీసులు ఐపీఎల్ మ్యాచ్ ఉందని, మొత్తం తమపై పెట్టొద్దని మనవి.. యాత్ర పూర్తయ్యాక రిటర్న్ అయ్యే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.. జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాల కాకుండా చూడాలి.. సుమారు 17 వేల మంది నగర పోలీసులతో పాటు 3 వేల మంది ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని హైదరాబాద్ పోలీస్ బాస్ సీవీ ఆనంద్ చెప్పారు.

## ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు రావాల్సిందే: ఖర్గే



అహ్మదాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలతో మునుపెన్నడూ లేనివిధంగా బీజేపీ మోసానికి పాల్పడి గెలిచిందని, ఈరోజు కాకపోయినా రేపైనా వాస్తవాలు బయటపడతాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అంటున్నారు. ఈ క్రమంలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లను తిరిగి తీసుకురావాల్సిందేనని గట్టిగా గళం వినిపించారాయన. బుధవారం ఏఐసీసీ సమావేశంలో పార్టీ కేడర్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ఖర్గే.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచమంతా ఈవీఎంల నుంచి బ్యాలెట్ పేపర్ల వైపు మళ్లుతోంది. కానీ, మనం ఇంకా ఈవీఎంలనే ఉపయోగిస్తున్నాం. ఇదే అతి పెద్ద మోసం. టెక్నాలజీని ఉపయోగించుకుని ఈవీఎంలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మళ్లీ.. ఈవీఎంల మోసాల్ని నిరూపించాలని వాళ్లే మమ్మల్ని అడుగుతున్నారు. ఈ విషయంలో యువతరం మేల్కొవాలి. బ్యాలెట్ పేపర్లు కావాలని ముందుకు వచ్చి పోరాడాలి. మహారాష్ట్రలో ఏం జరిగింది?. ఈవీఎంలతో అతిపెద్ద మోసం జరిగింది. అక్కడ ఎలాంటి ఓటర్ల జాబితాను రూపొందించారు?. బీజేపీ 90 శాతం సీట్లు ఎలా నెగ్గింది?. ఎన్నికల చరిత్రలోనే ఇలా ఎప్పుడూ జరగలేదు. అసలు మహారాష్ట్ర ఎన్నికలే పెద్ద మోసం. ఈ అంశాన్ని మేం దాదాపు ప్రతీ చోటా ప్రస్తావించాం. రాహుల్ గాంధీ గట్టిగా గళం వినిపించారు. హర్యానాలోనూ అదే జరిగింది. మా లాయర్లు, నేతలు.. ఆ దొంగలను దొరకబట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉంటాం. ఏదో ఒకనాటికి వాస్తవాలు బయటపడక తప్పదు. చట్టసభల్లో ప్రతిపక్షంగా మన గళం వినిపించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఏకపక్షంగా కేంద్రం బిల్లులను ఆమోదించుకుంటోంది. అలాంటప్పుడు ప్రజల గొంతుకను ఎలా వినిపిస్తాం?. అమెరికా టారిఫ్‌ల మీద చర్చకు అవకాశం ఇవ్వలేదు. మణిపూర్‌పై వేకువ జామున 4 గంటలకు చర్చిస్తామన్నారు. ఉదయం చర్చించాలని నేను అడిగితే తిరస్కరించారు. ప్రభుత్వం ఏదో దాస్తుందో కాబట్టే ఇలాంటి పనులు చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని నెమ్మది నెమ్మదిగా అంతం చేయాలని చూస్తున్నారు. రాజ్యాంగం మీద గత 11 ఏళ్లు దాడి జరుగుతూనే ఉంది. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనకు ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ అభివృద్ధి కోసం పలు సంస్థలను స్థాపించింది. కానీ, ప్రభుత్వ సంస్థలను మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులపరం చేసింది. జాతి ప్రయోజనాల కంటే.. ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాలే ముఖ్యంగా ఈ ప్రభుత్వం భావిస్తోంది. ఆఖరికి.. రిజర్వేషన్లనూ ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నంలో ఉంది. ఇది ఇలాగే కొనసాగితే దేశాన్ని అమ్మేసే ప్రమాదం లేకపోలేదు. బీజేపీ ఆరెస్సెస్‌లు మతపరమైన అంశాలతో వివాదాలు సృష్టించాలనుకుంటున్నాయి. మసీదుల కింద శివలింగాలను వెతకడం లేదంటూనే ఆ పని చేస్తున్నారు. ప్రధాని మోదీ మంట పెడితే.. ఆరెస్సెస్ దానికి ఆజ్యం పోస్తోంది. రాజస్థాన్ ఆల్వార్ ఘటనతో బీజేపీ దళిత వ్యతిరేక ధోరణి బయటపడింది. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ సుంకాలు పెంచడం, గ్యాస్ ధరలను పెంచడం ద్వారా ప్రజల నడ్డి విరుస్తున్నారు. దేశంలో అత్యాచారాలు పెరిగిపోతుంటే.. అమిత్ షా కఠిన చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారు?. పలు రాష్ట్రాల్లో గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు. తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం కోర్టు తీర్పు ఒక చెంపపెట్టు. ప్రజాహితం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు పలు చట్టాలు చేశాయి. భూసేకరణ చట్టం, నిర్బంధ విద్య, అటవీ రక్షణ చట్టాలు చేసింది. ఈ అంశాలపై మనం పోరాడాల్సిన అవసరం ఉంది.

### ఇక డీసీసీలదే పవర్

ఏఐసీసీ విస్తృతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పవర్స్ కట్టబెట్టింది. ఇక నుంచి అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీలదే నిర్ణయమని వెల్లడించింది. ఇది ఏఐసీసీ నిర్ణయంగా ఖర్గే బుధవారం ప్రకటించారు.

## సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తేనే బీజేపీలో గుర్తింపు



హైదరాబాద్: నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు భారతీయ జనతా పార్టీలో తప్పనిసరిగా తగిన గుర్తింపు లభిస్తుందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పదవీ స్వీకరణ కార్యక్రమం మంగళవారం మన్సూరాబాద్‌లో జరిగింది. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాజపేయి స్ఫూర్తితో వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి నాయకుడు, కార్యకర్త రంగారెడ్డి అర్బన్ జిల్లాలో పార్టీ పటిష్ఠతకు పాటుపడాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో కేసీఆర్ వైఫల్యాలు ప్రజలకు అర్థమైతే, కేవలం తొమ్మిది నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి పాలనలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బల్దియాపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణలో రైతులు ధైర్యంగా ఉన్నారంటే ఇందుకు మోదీ ప్రభుత్వమే కారణమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం పదవీబాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డిని వారు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్కా కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మహిళా మోర్చా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తోంది..



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలోని రుద్రారంలో గల గణేష్ గడ్డ ఆలయంలో మాజీ మంత్రి హరీష్ రావు పూజలు నిర్వహించారు. పటాన్ చెరు బీఆర్ఎస్ నేత ఆదర్శ్ రెడ్డి పాదయాత్రకు మద్దతుగా పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తోంది.. ఏడాది కాంగ్రెస్ పాలనలో పాలేవో.. నీళ్ళేవో ప్రజలకు తెలిసిపోయింది అని మండిపడ్డారు. ఆనాడు LRS ఫ్రీ అని చెప్పి.. ఇప్పుడు ముక్కు పిండి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ అని ఫైర్ అయ్యారు. ఇక, రైతు బంధు, రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి చెప్పేవి అన్ని అబద్ధాలే.. అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎం భట్టిలకు రుణమాఫీపై సవాల్ విసిరితే ఉలుకులేదు, పలుకు లేదు అని హరీష్ రావు అన్నారు. ఇక, కేసీఆర్ తెలంగాణను నిలబెడితే.. రేవంత్ రెడ్డి పడగొట్టాడు అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. దేశ సగటులో జీఎస్టీ తగ్గిందంటే దానికి కారణం రేవంత్ రెడ్డే.. కేసీఆర్ చెట్లు పెడితే రేవంత్ రెడ్డి నరుకుతా అంటాడు.. ఇక, హైడ్రాతో పేదల ఇల్లు కూల్చాడు.. కేసీఆర్ ది సాగు బాషా అయితే రేవంత్ రెడ్డిది చావు బాషా అని మండిపడ్డాడు. రేవంత్ రెడ్డి పని ఢిల్లీలో కూడా అయిపోయింది.. బీసీల ధర్నాకు ఢిల్లీలోనే ఉన్న రాహుల్ గాంధీ ధర్నాకు రాలేదు.. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అగ్రనాయకత్వం పట్టించుకోవడం లేదని తేల్చి చెప్పాడు. HCU విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టిన రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. HCUలో అడవులు నరికిన రేవంత్ రెడ్డికి మూగ జీవాల ఉసురు తగులుతుంది అని హరీష్ రావు శాపనార్థాలు పెట్టాడు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మంత్రులు కూడా వినడం లేదు అని బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ పాలన అంతా సగం సగం.. ఆగం ఆగం ఉందన్నారు. దేవుడినే మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బంగారు పళ్లెంలో పెట్టి తెలంగాణ రేవంత్ రెడ్డి చేతికి ఇస్తే అంత ఆగం చేస్తున్నాడు.. ఏడాదిలోనే లక్ష 50 వేల కోట్ల రూపాయల అప్పు చేశాడు.. రేవంత్ రెడ్డి వచ్చాక కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లకు రంగులు మాత్రం వేస్తున్నారు.. 10 ఏళ్లు దేశం మొత్తం తెలంగాణ వైపు చూసింది.. మళ్ళీ బీఆర్ఎస్ రావాలి, కేసీఆర్ కావాలి అని ప్రజలు కోరుకుంటున్నారు.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన 10కి 10 సీట్లు గెలిచి కేసీఆర్ కి గిఫ్ట్ ఇవ్వాలని హరీష్ రావు పిలుపునిచ్చారు.

### ఎందుకింత వివక్ష ఎస్సీ, ఎస్టీలంటే..?

హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విద్యావ్యవస్థను గాలికి వదిలేసిన సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. బెస్ట్ అవెలబుల్ స్కూళ్లను రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నార ని ఆర్ఎస్పీ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత వివక్ష ఎస్సీ ఎస్టీలంటే..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పేరుతో రూ. 26 వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.

## విక్టరీ డే పరేడ్.. ప్రధాని మోదీని ఆహ్వానించిన రష్యా



న్యూఢిల్లీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి మరోసారి ఆహ్వానం అందింది. మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆంద్రీ రుడెంకో వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా మే 9న రష్యా విక్టరీ డే పరేడ్ నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తన మిత్రదేశాలకు ఆహ్వానం పంపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీకి కూడా ఆహ్వానం పంపింది. విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు ఆంద్రీ రుడెంకో తెలిపారు. కాగా, గతేడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించారు. గత పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను భారత్ సందర్శించాలని ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ కూడా అంగీకరించా రు. అయితే, తేదీలు మాత్రం ఇంకా ఖరారు కాలేదు. 'పుతిన్ భారత పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి. మోదీ ఆహ్వానాన్ని ఆయన అంగీకరించారు. గతేడాది మోదీ మాస్కోలో పర్యటించారు.. ఇప్పుడు మా వంతు' అని రష్యా రాయబార కార్యాలయం గత నెల వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక పుతిన్, మోదీలు తరచూ ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారు. వివిధ అంశాలపై సంభాషించుకుంటున్నారు. అంతేకాదు పలు అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతున్నారు.

## సీఎంకు 'శీష్ మహల్' అడ్డంకి.. దక్కని అధికార నివాసం



న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీకి సీఎంగా రేఖాగుప్తా బాధ్యతలు చేపట్టి, 50 రోజులు దాటినా ఆమెకు అధికార నివాసం దక్కలేదు. ప్రస్తుతం ఆమె షాలిమార్ బాగ్‌లోని తన ప్రైవేట్ నివాసంలోనే ఉంటున్నారు. దీనికి 'శీష్ మహల్' వివాదమే కారణమనే వాదన వినిపిస్తోంది. గతంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివసించిన ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని విలాసవంతమైన భవనాన్ని బీజేపీ 'శీష్ మహల్'(అద్దాల మేడ)గా అభివర్ణించింది. ఈ నేపథ్యంలోనే నూతన సీఎం రేఖా గుప్తా ఆ బంగ్లాలో నివసించడానికి నిరాకరించారు. దానిని మ్యూజియంగా మార్చాలని ఆమె ప్రతిపాదించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పదవిని చేపట్టాక తాను శీష్ మహల్‌లో ఉండబోనని, అది ప్రజల సొమ్ము అని, దానిని వినియోగించే హక్కు తనకు లేదని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేజ్రీవాల్ విలాసవంతమైన జీవనశైలి కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేశారని ఆమె ఆరోపించారు. మరోవైపు సీఎం రేఖా గుప్తాకు ప్రత్యామ్నాయ అధికారిక నివాసం కేటాయించడం ఢిల్లీ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. అయితే ఢిల్లీ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యుడీ) ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు అధికారిక నివాసంగా మూడు బంగ్లాలను ఎంపిక చేసింది. సీఎం తన నివాసం కోసం వీటిలో ఒక బంగ్లాను ఎంపికచేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం సీఎం రేఖా గుప్తా షాలిమార్ బాగ్ నివాసంలోనే ఉంటూ, ఢిల్లీ సెక్రటేరియట్ నుండి పాలనా వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత అతిషి ఈ పరిస్థితిని విమర్శిస్తూ, 'బీజేపీ ఎన్నికల సమయంలో పలు వాగ్దానాలు చేసింది. అయితే ఇప్పుడు ఇప్పుడు ముఖ్యమంత్రికి నివాసం కూడా కేటాయించలేకపోతోంది' అని వ్యాఖ్యానించారు. అయితే ఈ వివాదాలకు అతీతంగా సీఎం రేఖా గుప్తా బీజేపీ ఎన్నికల హామీలైన మహిళా సమృద్ధి యోజన, యమునా నది శుద్ధీకరణ వంటి ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించారు.

## ఫ్రాన్స్‌తో భారత్ బిగ్ డీల్.. రాఫెల్-ఎం జెట్ల కొనుగోలుకు ఆమోదం



న్యూఢిల్లీ, ఫ్రాన్స్‌తో భారత్ బిగ్ డీల్ కుదుర్చుకుంది. రూ. 63,000 కోట్లతో 26 రాఫెల్-ఎం జెట్ల కొనుగోలుకు భారత్ ఆమోదం తెలిపింది. తాజా ఒప్పందంతో భారత నావికాదళానికి 22 సింగిల్-సీటర్, నాలుగు ట్విన్-సీటర్ విమానాలు రానున్నాయని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఫ్రాన్స్‌తో భారత్ ఒక మెగా ఒప్పందం చేసుకుందని ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. రూ.63,000 కోట్లకు పైగా విలువైన ఒప్పందంపై త్వరలో సంతకాలు జరుగుతాయని వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల చివరిలో ఫ్రెంచ్ రక్షణ మంత్రి సెబాస్టియన్ లెకోర్ను భారతదేశాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఒప్పందంపై సంతకం చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. 2023, జూలైలో రక్షణ మంత్రిత్వ శాఖ.. ఫ్రాన్స్ నుంచి రాఫెల్-ఎం జెట్‌ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. దేశీయంగా తయారైన ఐఎన్ఎస్ విక్రాంత్‌తో కలిసి ఈ రాఫెల్ ఎం జెట్‌లు పని చేయనున్నాయి. ఒప్పందం తర్వాత 37 నుంచి 65 నెలల్లో రాఫెల్ విమానాలు డెలివరీ అవుతాయి. హిందూ మహాసముద్రంలో చైనా ఉనికి పెరుగుతున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తం అయింది. రాఫెల్ ఎం జెట్ విమానాల రాకతో సముద్రంలో గస్తీ పెంచడానికి ఉపయోగపడనున్నాయి. పొరుగువారి నుంచి ముప్పులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండేందుకే ఈ విమానాలు కొనుగోలు చేస్తున్నట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ త్రిపాఠి తెలిపారు.

## సంపాదకీయం

**గురువారం 10-04-2025**

# అప్పులతో ఎంతకాలమీ పాలన !

ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబిరించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలు అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టాల చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి...రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకాశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జ్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారంఏటేటా తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందిం చాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. వంటనూనెల మిల్లలును దేశీయంగా రూపొదించి, మన నూనెలను మనమే వాడగలిగేలా చేయాల్సిఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ.. ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సి ఉంది. అందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెంచుకోవాల్సి ఉంది. ప్రతిదానికి కేంద్రంపై చేయిసాచకుండా సొంతంగా ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి. ఆదాయం ఉన్న మేరకు ప్రణాళికలు ఉండాలి. అంతే తప్ప రాజకీయాల కోసం పాలన చేయడం సరికాదు.

# ట్రంప్ సుంకాల దెబ్బకు ఆంధ్ర రొయ్యల రైతులు ఫ్రై



అమరావతి,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఏపీ ఆక్వా రైతులపై పడింది. ట్రంప్ వేసిన ట్యాక్సులు మేం కట్టలేం బాబో అని మన వ్యాపారులు చేతులెత్తేశారు. ఇప్పటికే లక్షలు, కోట్లలో నష్టపోయామని, ఇప్పట్లో రొయ్యలు కొనలేమని తెగేసి చెబుతున్నారు. మరి కొంత మంది రొయ్యల రేట్లు తగ్గించి మరీ కొంటున్నారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకునే ఆక్వా ఉత్పత్తులపై 27 శాతం ఇంపోర్ట్ టారిఫ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించారు. గోదావరి జిల్లాల్లోని ఆక్వా రైతులపై ఈ నిర్ణయం ప్రభావం గట్టిగా పడింది. ఇంపోర్ట్ టారిఫ్ భారం మన ఆక్వా రైతులపై డైరెక్ట్‌గా పడుతుండటంతో ఇప్పటికే తాము చాలా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ట్రంప్ టారిఫ్ దెబ్బకు భీమవరం, పాలకొల్లు, పెద్దాపురం, కాకినాడ, తుని తదితర ప్రాంతాల్లోని ప్రాసెసింగ్ ప్లాంట్లు రొయ్యలను కొనుగోలు చేయడం మానేశాయి. రైతులు ప్రాధేయపడితే మార్కెట్ ధర మీద 30 రూపాయల నుంచి 90 రూపాయల వరకు తగ్గించి కొంటున్నారు. దీని వల్ల చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు ఏప్రిల్ మొదటి వారంలో భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యేందుకు ఆక్వా ప్రొడక్ట్స్‌తో 2 వేల షిప్‌మెంట్లు సిద్ధంగా ఉన్నాయి. మరో 2500 షిప్‌మెంట్లకు సరిపడా సరుకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంది. వీటిలో మొత్తంగా దాదాపు 3500 షిప్‌మెంట్లు ఏపీకి చెందినవేనని ఎగుమతిదారులు చెబుతున్నారు. అమెరికా కొత్తగా విధించిన ఇంపోర్ట్ టారిఫ్ ప్రకారం లెక్కిస్తే వీటిపై నష్టభారం 600 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఈ మొత్తాన్ని నష్టపోవడమే తప్ప ఈ భారాన్ని తిరిగి కష్టమర్లపై వెయ్యలేని పరిస్థితి ఉందని ఎగుమతిదారులు చెబుతున్నారు. ఓ పక్క వ్యాధులు, మరోపక్క ధరల పతనం, పెట్టుబడి ఖర్చులతో కష్టాల్లో ఉన్న ఆక్వా రంగానికి తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం మింగుడు పడటం లేదు. భారత్ నుంచి దిగుమతి అయ్యే రొయ్యలపై అమెరికాలో విదేశీ సుంకం పెంచడంతో, గంటల వ్యవధిలోనే ఆయా కౌంట్లను బట్టి రొయ్యల ధరలు పతనమయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో కిలో ధర గరిష్ఠంగా రూ.40 వరకు పడిపోయింది. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తుల్లో రొయ్యలది మూడో స్థానం. ఏపీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచే సింహభాగం ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు.ఏటా ఉత్పత్తి 4 లక్షల టన్నులు కాగా, 3.5 లక్షల టన్నుల వరకు విదేశాలకు పంపిస్తున్నారు. మొత్తంగా రూ.18 వేల కోట్ల వ్యాపారంలో విదేశీ లావాదేవీల వాటే అధికం. ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రావడంతో ఆ ప్రభావం ఇక్కడి ఆక్వా ఉత్పత్తులపై పడింది. బుధవారం 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.240 ఉండగా, గురువారం రూ.200కి తగ్గిపోయింది. సాధారణంగా 40, 30, 20 కౌంట్లు ఉండే రొయ్యలు మాత్రమే అమెరికాకు ఎగుమతి చేస్తారు. అయితే, ప్రతీకార సుంకాన్ని సాకుగా చూపించి అన్ని కౌంట్లపై గరిష్ఠంగా కిలోకు రూ.30-40 వరకు తగ్గించారు. కొన్నిచోట్ల కొనుగోళ్లు లేవని, ట్రేడర్లు ముందుకు రాలేదని రైతులు వాపోయారు. సాగుదారులపైనే కాదు, ఆక్వా రంగంపై ఆధారపడ్డ కూలీల ఉపాధికి కూడా ఇది దెబ్బేనని ట్రేడర్లు చెబుతున్నారు.

### పోర్చుగల్ పర్యటనలో రాష్ట్రపతి ముర్ము

లిస్బన్,పోర్చుగల్- భారత్ ద్వైపాక్షిక సంబంధాలు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పోర్చుగల్ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా పోర్చుగల్ అధ్యక్షుడు మార్సెలో రెబెలో డి సౌసా సోమవారం సాయంత్రం లిస్బన్‌లోని పలాసియో డా అజుడాలో విందు ఏర్పాటు- చేశారు. ఈ విందుకు ద్రౌపది ముర్ము మాజరయ్యారు.

# బాబూ-పవన్ ను ఆదర్శంగా తీసుకోండి!



బెంగళూర్ :కర్ణాటకలో సూపర్ సిక్స్ హామీలను ఇచ్చి వాటి అమలు కోసం అష్టకష్టాలు పడుతూ ఉంది సిద్ధరామయ్య సర్కారు. కర్ణాటకలో హిట్టైన సూపర్ సిక్స్ లను చూసి తెలంగాణలో కూడా వాటినే అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించింది. అధికారం దక్కించుకుంది. కట్ చేస్తే.. ఆ హామీల అమలుకు రేవంత్ రెడ్డి సర్కారు దక్కామొక్కీలు తింటూ ఉంది. మరి అవే హామీలను కాపీ కొట్టి ఏపీలో ప్రకటించారు సోకాల్డ్ విజనరీ చంద్రబాబు నాయుడు! ప్రపంచ రాజకీయానికే తను విజనరీ అని కనీసం మొహమాటం లేకుండా చంద్రబాబు ప్రకటించుకుంటూ ఉంటారు తరచూ! అయితే.. ఆఖరికి ఉచిత హామీల ను కూడా కాంగ్రెస్ నుంచి కాపీ కొట్టారు! అదే పేరుతో ప్రకటించుకున్నారు! ఎలాగైతేనేం.. అధికారం దక్కింది!ఇక హామీలంటారా! అవేంటి? అనే పరిస్థితుల్లో ఉన్నారు ఇప్పుడు చంద్రబాబు, ఆయన దోస్తు పవన్ కల్యాణ్! అధికారం దక్కి ఏడాది దగ్గరపడటానికి ఇక రెండు నెలల సమయం ఉంది గట్టిగా.. మరి ఇప్పటి వరకూ ఆ సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయో.. వాటితో పాటు ప్రకటించిన లెక్కలేనన్ని హామీల్లో ఏవి అమల్లోకి వచ్చాయో కూడా ఎవరికీ తెలీదు! సామాన్యులను అడిగితే.. తిడుతున్నారు!చినబాబు లోకేష్ ఏమో.. జగన్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలతో పోలిస్తే.. ఎన్నో సంక్షేమ పథకాలను తాము గత ఏడెనిమిది నెలల కాలంలోనే అమలు చేసేశాం అంటున్నారు! అయితే.. మళ్లీ మే నెల నుంచి తల్లికి వందనం పెడతామంటారు! మరి ఒకవైపు అన్నీ అమలైపోయాయి.. రికార్డు స్థాయిలో అమలు చేసేశాం అనేది వారే, అబ్బే లేదు.. ప్రతి దానికీ ఒక ముహూర్తం అంటూ ప్రకటించేదీ వారే! ఇక ఇటీవలి బడ్జెట్ లో చేసిన కేటాయింపులకూ, ఆ సంక్షేమ పథకాల వాస్తవిక అంచనాలకూ ఏ మాత్రం సంబంధం లేదు!ఇక సంపద సృష్టి సంగతి సరేసరి! తనకు అధికారం ఇస్తే.. జగన్ అమలు చేసిన ప్రతి పథకాన్నీ అమలు చేస్తానంటూ చంద్రబాబు నాయుడు గత ఐదేళ్లలో అనేక సార్లు చెప్పుకున్నారు! అయితే జగన్ అప్పులు చేసి పథకాలు ఇస్తున్నాడని, తను మాత్రం సంపద సృష్టి చేసి ఆ పథకాలను అమలు చేస్తానంటూ చెప్పుకున్నారు! మరి గత ఏడెనిమిది నెలల్లో చేసిన సంపదసృష్టి ఏమిటంటే.. వేల కోట్ల రూపాయల అప్పులు! ఇప్పుడు కూడా చంద్రబాబు నాయుడు అప్పోసప్పో చేసి.. ఏ ఏడాది మే నెలలో తల్లికి వందనం పెడతామంటున్నారు! మరి ఇప్పటి వరకూ సృష్టించిన సంపద ఏమైంది! అప్పుల తిప్పలు తప్ప ఇప్పటి వరకూ జరిగిన అద్భుతాలు ఏమీ లేవు!అసలు చంద్రబాబు నాయుడు -జనసేన లు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఏపీ బడ్జెట్ సరిపోదు కదా, పక్క రాష్ట్రాల నుంచి పన్నులన్నీ వసూలు చేసినా చాలవు! ఆ స్థాయిలో ఉన్నాయి ఆ హామీలు. ఉదాహరణకు రైతుల కోసం ప్రతి యేడాదీ ఇరవై వేల రూపాయల పెట్టుబడి సాయం అని ప్రకటించారు! మరి గత ఏడాది ఖరీఫ్ పంట ముందు రూపాయి విదల్చలేదు, రైతులైతే పిచ్చ క్లారిటీకి వచ్చేశారు ఈ పాటికే! చంద్రబాబు నాయుడు ఏ హామీని అమలు చేయడు, తమకు రూపాయి కూడా ఇవ్వడు అని కర్షక లోకం కోడై కూస్తూ ఉంది. అయితే ఇదే రైతాంగం జగన్ హాయాంలో తెగ బాధపడిపోయింది. ఎందుకు ఆ బాధ అంటే.. ఆటో డ్రైవర్లకు డబ్బులు ఇస్తున్నారు, మగ్గాలు నేసే వాళ్లకు జగన్ డబ్బులు ఇస్తున్నాడు, వారితో పోలిస్తే తమకు కాస్త తక్కువ ఇస్తున్నాడు అంటూ రైతాంగంలో తెగ నిరసన కనిపించింది. జగన్ హయాంలో పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆరు వేల వరకూ ఇచ్చినట్టుగా ఉంది. ఆటో నడిపేవాడికి పదివేలు, మాకు ఆరు వేలా.. అన్నట్టుగా రైతులు కొందరు ఊగిపోయారు! జగన్ పై తెగ కోపం తెచ్చుకున్నారు!మరి ఇప్పుడు అది కూడా లేదు! ఆల్ హ్యాపీస్! ఆటోవాడికీ లేదు, బీసీ మహిళా నేస్తం లేదు, ఓబీసీ మహిళా నేస్తం లేదు, మగ్గం నేసే వాళ్లకూ ఏడాదికి 15 వేలు లేదు, సమాజంలోని ఏ వర్గానికీ అణాపైసా విదల్చడం లేదు! అదేమంటే పెన్షన్ల హామీ ఒక్కటీ అమలైంది. దానికి తెలుగుదేశంపార్టీ వాళ్లు తెగ దీర్ఘాలు తీస్తూ ఉన్నారు! ఆ పెన్షన్ డబ్బులును అయితే తెలుగుదేశం నేతలు తమ ఇళ్లలోని డబ్బును తీసుకెళ్లి పంచుతున్నట్టుగా బిల్డప్ లు ఇస్తూ ఉన్నారు!ప్రశ్నించడానికే పార్టీ పెట్టినట్టుగా పుష్కరకాలం కిందట ప్రకటించిన పవన్ కల్యాణ్ కు ఇప్పుడు తమ హామీల అమలు గురించి వస్తున్న ప్రశ్నలు వినిపించనట్టుగా ఉన్నాయి! తమ హామీల చిట్టాను పవన్ కల్యాణ్ కూడా అనేకసార్లు చదివి వినిపించారు! సంక్షేమ పథకాల విషయంలో జగన్ కన్నా తాము గొప్పగా చేస్తామంటూ పవన్ కల్యాణ్ కూడా ఎన్నికల సమయంలో నొక్కివక్కాణించారు!అయితే ఏపీ రాజకీయంల ఎప్పుడూ రసవత్తరంగా, రసకందాయకంగా ఉంటుంది ఏదో ఒక రూపంలో! ఇప్పుడు సంక్షేమ పథకాల విషయంలో కూడా కామెడీ ఉంది. జగన్ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధిని బాగా పొందిన వారు కూడా గత ఎన్నికల్లో జగన్ పార్టీకి ఓటేయలేదు! ఇది అందరూ ఒప్పుకునే వాస్తవం. అందులో ప్రత్యేకించి చేనేత కార్మికులు కూడా ఉన్నారు. అందుకు ఉదాహరణ పూర్వ అనంతపురం జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో కేవలం చేనేత పని మీద ఆధారపడి వారు అటు ఇటుగా లక్షజనాభాలో ఉంటారు. వీరంతా మగ్గాల మీద ఆధారపడి బతికే వారు. కుటుంబాల వారీగా చూసుకుంటే అటు ఇటుగా ముప్పై వేల కుటుంబాలు! వీరిలో కొందరు ధనికులు ఉన్నా.. మెజారిటీ చేనేత కార్మికులు ఏ పూటకు ఆపూట బతికేవారే! ఒక చీర నేస్తే.. వెయ్యి రూపాయల వరకూ మిగులుతుంది. చేతి మగ్గం మీద వారానికి ఒక చీర పూర్తి చేస్తే అదే గొప్ప! భార్య, భర్త ఇద్దరూ కలిసి ఒక మగ్గం నేసే వారు, రెండు మగ్గాలతో కష్టపడే వారే వీరిలో ఎక్కువమంది. ఇలాంటి వారి కోసం జగన్ ఏడాదికి 15 వేల రూపాయలు ఇచ్చాడు.ప్రత్యేకించి కరోనా వంటి సమయంలో.. చేనేత కార్మికులు మరింత ఇక్కట్లలో ఉన్న సమయంలో ఆ 15 వేలు కూడా చాలా గొప్పవిగా కనిపించాయి! అందులోనూ.. ఇంట్లో ఇద్దరు కొడుకులు ఉంటే, ఇద్దరూ చెరో రేషన్ కార్డు మీద అలాంటి సాయాన్ని పొందారు. ఇలా ఏడాది లో 30 వేలు, 45 వేలు అందుకున్న కుటుంబాలు కూడా చాలా ఉంటాయి. ఈ చేనేత కార్మికులు చాలా మంది బీసీలు. దీంతో.. వారికి బీసీ మహిళా నేస్తం, అమ్మఒడి వంటి పథకాల సాయం కూడా అందింది! ఇలా ఎలా చూసినా.. ప్రతి కుటుంబం ఏడాదికి 50 వేల రూపాయల నుంచి, లక్ష వరకూ వివిధ రకాలుగా సాయం పొందారు! మరి అలాంటి సంక్షేమ పథకాల ఫలితం ఓటుగా మారి ఉంటే.. ధర్మవరంలోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లక్ష మెజారిటీతో నెగ్గాలి! అయితే నియోజకవర్గంలో ఎవరికీ తెలియని బీజేపీ నేత ఒకరు పోటీ చేస్తే.. నియోజకవర్గంలో నిత్యం కలియదిరిగిన కేతిరెడ్డి దాదాపు నాలుగు వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు! ఇదంతా జరిగిన సీన్!కట్ చేస్తే.. ఇప్పుడు ఇలాంటి చోట.. సంక్షేమ పథకాల ఊసు లేదు! చేనేత నేస్తం లేదు, బీసీ నేస్తం లేదు, అమ్మ ఒడి లేదు.. దొరుకుతున్నదల్లా కావాల్సిన సమయంలో బుడ్డీ! అన్నీ పోయాకా.. ఇక బుడ్డీ కొనడానికి కూడా చాలా కష్టంగా మారింది కార్మికవర్గానికి!అయితే ఏదైనా అనుకోకుండా దక్కినప్పుడు, లేదా అడగకుండానే వస్తున్నప్పుడు దాని విలువ ఎవ్వరికీ అర్థం కాదు! ఇప్పుడు అడిగితే తంతారు! విసిరింది తీసుకోమనే పరిస్థితి ఉంది! దీంతో.. తీసుకుంటున్న దాని విలువను అర్థం చేసుకోలేకపోయిన కార్మిక వర్గానికి ఇప్పుడు తత్వం బోధపడుతూ ఉంది. పార్టీల అభిమానాలను పక్కన పెడితే.. రోజు గడవడం గురించి ఆలోచనలు సాగించాల్సిన కార్మిక వర్గాలకు ఇప్పుడు సెగ ఎలా ఉంటుందో అర్థం అవుతూ ఉంది. అప్పుడు ప్రభుత్వమే అంతా పోషించిందా అంటే.. కాకపోవచ్చు! అయితే వేన్నీళ్లకు చన్నీళ్లు అన్నట్టుగా.. అతి సామాన్య కుటుంబాలకు, ప్రతి రూపాయీ విలువైనదిగా భావించే కుటుంబాలకూ ఇప్పుడు లోటు ఏమిటో తెలుస్తూ ఉంది. పని చేసుకుంటూ, ప్రభుత్వం అందించే సాయాన్ని అందుకుంటూ.. కుటుంబాలను నడుపుకున్న వాళ్లు ఇప్పుడు ఏర్పడిన లోటు మేర అయినా.. అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితుల్లో పడిపోయాయి! ఇది ఏడాది కాలంలో మారిన ఒకానొక జీవన చిత్రం!సంక్షేమ పథకాలతో జనాలు సోమరులుగా మారిపోతున్నారు అనేయడం తేలికే కానీ, పేదరికాన్ని అనుభవించే వారికి మాత్రం సంక్షేమ పథకాలు అంటే ఏమిటో బాగా తెలుసు! అందరూ అలాంటి నేపథ్యం నుంచి వచ్చిన వారే, అయితే కళ్లు మూసుకుపోయిన రాజకీయ అభిమానాలతో నోటికొచ్చినట్టుగా మాట్లాడతారంతే!మరి ఏపీలో ఇలాంటి పరిస్థితి ఉంటే.. పక్క రాష్ట్రాల్లో ఇచ్చిన హామీల అమలు చేసుకుని మంచి పేరు తెచ్చుకోవాలని ప్రభుత్వాలు తెగ ప్రయాస పడుతూ ఉన్నాయి. ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశానని చేసి చూపించిన జగన్ కు దక్కింది 11! మరి హామీలు ఇచ్చాం కదా.. అని తెగ ప్రయాసపడుతున్న కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ ల పరిస్థితి ఏమవుతుందో పెద్దగా విశ్లేషించనలు అవసరం లేనట్టుగా ఉంది! ఇలాంటి నేపథ్యంలో.. లెక్కలేనన్ని హామీలు ఇచ్చి, వాటి ఊసెత్తకుండా కాలం గడుపుతున్న వారు ధన్యులు కారా!

# బిజెపిది ప్రజావ్యతిరేక విధానం

కర్నూలు,దేశంలో రోజురోజుకు ఫాసిజం పెరుగుతోందని సిపిఎం సీనియర్ నాయకులు గఫూర్ ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టం ఏకపక్షమని అభిప్రాయపడ్డారు. ఇందులో ముస్లిమేతరులను సభ్యులగా చేయాలన్న నిర్ణయం సరికాదని అన్నారు. మార్క్సిజాన్ని ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.కేంద్రంలోని బిజెపి మతోన్మాద శక్తుల మనువాద పాలన, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు జాతి సంపదను అప్పచెప్పే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఇకపోతే ఉపాధి కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా వారికి కనీస వసతులు కల్పించాలని అన్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. ఈ ఎండలతో ఉపాధి కార్మికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి నేపథ్యంలో గతంలో ప్రతిరోజూ ఒక్కో కార్మికుడికి రెండు లీటర్ల తాగునీటి కోసం రూ.5 వేతనంతో పాటు ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదని కార్మికులు తెలిపారు. తట్టకు రూ.3, గునపానికి రూ.5 ఇవ్వడం కూడా నిలిపివేశారని చెబుతున్నారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం పూర్తిగా అందట్లేదు. పని ప్రదేశంలో కనీస వసతులను కల్పించడం ప్రభుత్వం మరిచిందని పలువురు ఉపాధి కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేస్తున్న కార్మికులను వసతుల గురించి ఆరా తీయగా నీడ కోసం కనీసం టెంట్లు కూడా లేవు. మండుటెండలో పనులు చేయాల్సి వస్తోందని ఉపాధి కార్మికులు వాపోయారు. ప్రథమ చికిత్స కిట్లు ఉన్నప్పటికీ మందులు ఉండడం లేదని వివరించారు. రెక్కాడితేనేగాని డొక్కాడని పరిస్థితి వీరిది. ఎండలున్నప్పటికీ పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళ్లాల్సి వస్తోంది. టెంట్లుగానీ, తాగునీటి సౌకర్యంగానీ కల్పించడం లేదు. ఇంటి నుంచే తాగునీటిని పట్టుకెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే మందులు కూడా ఇవ్వడం లేదు. పని ప్రదేశాల్లో వారికి రోణ కల్పించాలని గఫూర్ కోరారు.

# ఒంటిమిట్టలో విభిన్నంగా సీతారాముల కళ్యాణోత్సవం

కడప,ఒంటిమిట్ట రామాలయంలో భిన్నంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. భద్రాచలంతో పాటు దేశమంతా శ్రీరామనవమి వేడుకలు, కళ్యాణోత్సవాలు జరుగుతాయి. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా నిర్వహిస్తారు. ఒంటిమిట్టలో ఈ నెల 11న సీతారాముల కల్యాణత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏకశిలానగరిలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న తితిదే ఆధ్వర్యంలో నిర్వహించే కల్యాణోత్సవం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాములోరి పెళ్లి క్రతువులో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఇకపోతే చరిత్రలోకి వెళితే...రాముడి కథే రామాయణం. కేవలం శ్రీ సీతారాముల చరిత్రే అనుకుంటే పొరపాటే. జీవనవిధాన్ని తెలిపే మాహాకావ్యం. రామాయణంలో ప్రధాన ఘట్టాల్లో సీతారాముల కళ్యాణం ఒకటి. అసలు ఈ కళ్యాణం మొదట ఎక్కడ జరిగింది... కౌశల్యా తనయుడు శ్రీరాముడు అయోధ్యలో జన్మించాడు. సీతమ్మ తల్లి మిథిలానగరంలో జన్మించింది. రాముడి మామగారైన జనకుడు పాలించిన రాజ్యమే మిథిలా నగరం. బీహార్ నుంచి నేపాల్ వరకూ ఈ మిథిలా రాజ్యం విస్తరించి ఉందని చెబుతారు. ఈ రాజ్యాన్ని విదేహ రాజ్యం అని కూడా పిలిచే వారట. ఆ పేరుమీదే సీతాదేవికి వైదేహి అనే పేరువచ్చింది. అప్పట్లో జనకుడు ఉన్న రాజధానే ప్రస్తుతం నేపాల్లో ఉన్న జనక్ పూర్ అని ప్రజల నమ్మకం. సీతాదేవి జన్మించిన ప్రాంతం ఇదేనన్న విషయం కాలక్రమేణా ప్రజలు మర్చిపోయారు. సుర్కిశోర్దాస్ అనే సన్యాసికి 1657లో ఇక్కడ సీతాదేవి విగ్రహాలు లభించడంతో, ఇక్కడి ప్రజలు తమ చరిత్రను తిరిగి గుర్తుచేసుకోవడం మొదలు పెట్టారు. ఆ చరిత్రకు చిహ్నంగా 1910లో వృషభాను అనే నేపాల్ రాణి 'జానకీ మందిర్' పేరుతో ఓ ఆలయాన్ని నిర్మించారు. వేల గజాల విస్తీర్ణంలో, 150 అడుగుల ఎత్తున్న ప్రాకారంతో, పాలరాతి గోడలూ, అద్దాల మేడలతో నిర్మించిన ఈ ఆలయానికి అప్పట్లో తొమ్మిది లక్షల రూపాయలు ఖర్చయిందట. అందుకనే ఈ ఆలయానికి 'నౌ లాఖ్ మందిర్' అన్న పేరు కూడా ఉంది. జానకీమందిర్ నిర్మించిన ప్రాంతంలోనే సీతాదేవి శివ ధనుస్సుని పూజించిందని చెబుతారు. సీతారాముల కళ్యాణం జరిగింది కూడా ఈ స్థలంలోనే అని భక్తుల విశ్వాసం. అందుకనే జానకీమందిరంలోని నైరుతి దిక్కున పెద్ద వివాహ మండపాన్ని నిర్మించారు. ఏటా మార్గశిర మాసం శుక్ల పంచమి రోజున ఇక్కడ వైభవంగా సీతారామ కళ్యాణం నిర్వహిస్తారు. ఆ రోజే సీతారాముల వివాహం జరిగిందని అక్కడి ప్రజల నమ్మకం. కానీ తెలుగువారు శ్రీరామనవమి రోజునే ఆయన కళ్యాణం నిర్వహించుకోవడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది. ఈ జనక్ పూర్ కి 18 కిలోమీటర్ల దూరంలో 'ధనుషధామ్' అనే ప్రాంతం ఉంది. రాముడు విరిచిన శివుని ధనుస్సు ఇక్కడే పడిందని భక్తుల విశ్వాసం. ఇంతకీ చెప్పేదేంటంటే రాముడి కళ్యాణం జరిగిన ప్రదేశమే జనక్ పురి. నేపాల్ వెళ్లినవారిలో శ్రీరామచంద్రుడి భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. గతంలో నేపాల్ పర్యటనకు వెళ్లినప్పుడు ప్రధాని నరేంద్రమోదీ కూడా ఈ ఆలయాన్ని దర్శించుకున్నారు.అప్పుడు ఈ ఆలయం ప్రత్యేకత గురించి పెద్ద చర్చే జరిగింది.

# పోలీసులకు ఫిర్యాదుతో ఉద్యోగి సస్పెన్షన్

అచ్చంపేట,నాగర్ కర్నూల్ జిల్లాలో ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ చేతివాటం వెలుగుచూసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం కేంద్రంలోని ఎస్ బిఐ ఉద్యోగి బాగోతం వెలుగులోకి వచ్చింది. 45 మంది రైతుల ఖాతాల నుంచి కోటిన్నర రూపాయలను బ్యాంకు ఉద్యోగి కిరణ్ తన ఖాతాకు మళ్లించాడు. దీంతో రైతులు తమ ఖాతాల నుంచి డబ్బులు మాయం కావడంతో బ్యాంకు మేనేజర్ కు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంకు ఉన్నతాధికారుల కిరణ్‌ను సస్పెండ్ చేశారు. రైతుల నిలదీతతో డబ్బులు తిరిగి జమ చేస్తామని బ్యాంకు మేనేజర్ హామీ ఇచ్చాడు. చేతివాటం ప్రదర్శించి కోట్లు కొల్లగొట్టిన ఎస్బిఐ బ్యాంకు ఉద్యోగి కిరణ్, బ్యాంకు ఖాతాదారులైన 45 మంది రైతుల సొమ్ము కోటిన్నర తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. తమ ఖాతాల్లోని డబ్బు మాయం అవడంపై రైతులు బ్యాంకు మేనేజర్ ను నిలదీశారు. ఏవో కారణాలు చెప్తూ.. నేడు, రేపు అంటూ తప్పును కప్పిపుచ్చేందుకు బ్యాంకు మేనేజర్ ప్రయత్నం చేశాడు. రైతులు నిలదీయడంతో త్వరలోనే డబ్బులు ఖాతాలో జమ చేస్తానని బ్యాంకు మేనేజర్ హామీ ఇచ్చాడు. రోజులు గడుస్తుండడంతో ఆందోళనకు గురైన ఖాతాదారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. రైతుల సొమ్ము కోటిన్నర తన ఖాతాలోకి మళ్లించుకున్న ఉద్యోగి కిరణ్ ను అధికారులు సస్పెండ్ చేశారు.

# వల్లభనేని వంశీకి మరోమారు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీమోహన్‌కు న్యాయస్థానం మరోసారి రిమాండ్ పొడిగించింది అతని కస్టడీ ముగియడంతో మంగళవారం పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. విచారణ జరిపిన కోర్టు ఈనెల 22వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుతో పాటు టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఇంకా అరెస్టు కావలసిన ప్రధాన నిందితుల్లో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముఖ్య అనుచరుడు కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లు ఒకరు. అతడితోపాటు మరి కొంతమంది విదేశాల్లో ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ కేసులో మొత్తం 12 మంది నిందితులు ఉండగా.. వంశీ, వెలినేని శివరామకృష్ణ ప్రసాద్, గంటా వీర్రాజు, నిమ్మ చలపతి, వేల్పూరు వంశీబాబులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వాళ్లంతా విజయవాడలోని జిల్లా జైల్లో ఉన్నారు. ఏ-5గా ఉన్న ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగాను గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారంలో సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కిడ్నాప్ కేసులో పీటీ వారెంటుపై కోర్టులో హాజరుపరచడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ కేసులో రంగాతోపాటు కోట్లుదీ సమాన పాత్ర. సత్యవర్ధన్‌కు సంబంధించిన మొత్తం సమాచారాన్ని కోట్లే సేకరించి రంగాతో పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వంశీని అరెస్టు చేసిన మరుక్షణమే ఇద్దరూ ఊరు దాటేశారు. రంగా ఇటీవల ఏలూరులో సీఐడీ బృందానికి దొరికిపోయాడు. మిగతా ఆరుగురిలో విశాఖకు చెందిన ఇద్దరు నిందితులు శ్రీకాకుళం వైపు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. నేపాల్లో తలదాచుకున్న కోట్లు-, మరో ముగ్గురు.. అక్కడి నుంచే సన్నిహితులకు ఫోన్ చేసి కేసు విషయాలను, పోలీసుల కదలికలను తెలుసుకుంటున్నట్లు సమాచారం. పక్కా వివరాలు అందగానే అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్దంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# సమస్యలపై కానరాని చిత్తశుద్ధి

న్యూఢిల్లీ, ప్రజాస్వామ్యం బలంగా సాగాలంటే బలమైన ప్రతిపక్షం అవసరం. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడాలనుకుంటున్నా.. బలమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. బలంగా పోరాడడం లేదు. కనీసం ఇతర పక్షాలను కలుపుకుని పోవడంలోనూ వైఫల్యం కానవస్తోంది. ఎంతసేపు రాజ్యాంగ ప్రతిని పట్టుకుని రాహుల్ మాట్లాడడం తప్ప ప్రధాన సమస్యలపై నిర్మాణాత్మక చర్యలకు పూనుకోవడం లేదు. అలాగే వక్ఫ్ చట్టం లోని మంచి చెడులపై మాట్లాడలేకపోయారు. అందుకే ఇండియా కూటమిని బలంగా నిర్మించడం లోనూ విఫలమయ్యింది. దేశం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నా... ప్రతిపక్షాలు ఉమ్మడిగా మోడీ ప్రభుత్వాన్ని నిలదీయలేక పోతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిగ్గదీయలేకపోతున్నాయి. కేవలం ఓటు బ్యాక్ రాజకీయాల కోసం వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించారు. అందుకే పెద్దగా బలమైన కూటమిగా కాంగ్రెస్ కానరావడం లేదు. ప్రధాన సమస్యలను పార్లమెంటులో చర్చించడంలో కాంగ్రెస్ విఫలం అయ్యింది. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న నిరుద్యోగం, జిఎస్టీ తదితర అంశాలపై స్పష్టత కానరావడం లేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా, తన పాత్రను బలంగా నిర్వహించలేక పోతున్నది. మిగతా పార్టీలను కలుపుకుని అధికారపార్టీకిచెక్ పెట్టకోలేకపోతున్నది. ప్రజలను అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ విధానాలతో నానాయాతన పడుతున్నారు. ప్రధానంగా పెట్రో ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్యలపై చర్చించే విషయంలో ఉమ్మడిగా పోరాడలేక పోతున్నాయి. నిజానికి దేశంలో కాంగ్రెస్ పార్టీ దుస్థితి గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. బలపడాలన్న కాంక్ష కనిపించడం లేదు. ప్రజల పక్షాన పోరాడాలన్న తపన కానరావడం లేదు. ఒకరకంగా ప్రతిపక్ష పార్టీ బలంగా లేకపోవడం వల్ల మోడీకి బలం తక్కువున్నా ఏమీ చేయలేక పోతున్నారు. ప్రతిపక్షాల అనైక్యత అవినీతి కారణంగా మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఖాతరు చేయడం లేదు. వారు ఇచ్చే ఎలాంటి సూచనలను కూడా పరిగణించడం లేదు. ధాన్యం సేకరణపై జాతీయ విధానం కావాలని రైతులు పట్టుబట్టి పోరాడుతున్నా ఖాతరు చేయడం లేదు. దీనిని బట్టి రైతులపట్ల మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రేమ ఉందో గమనించ వచ్చు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల ప్రైవేటీ కరణ,లేబర్ కోడ్‌ల అమలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణతో పాటు మరిన్ని ఆర్థిక సంస్కరణల విషయంలో మరింత వేగంగా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నా రైతుల గురించి ఆలోచించే దాఖలాలు కనిపించడం లేదు. కనీస మద్దతుధరకు విలువ లేకుండా పోతుంది. మద్దతు ధరల కోసం రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదు. ఒంటరిగా పోరాడి నందున కాంగ్రెస్‌కు ఫలితం దక్కడం లేదు. ప్రధాన సమస్యలపై కలసికట్టుగా పోరాడేందుకు వ్యూహం పన్నడంలో రాహుల్, సోనియాలు పూర్తిగా విఫలం అవుతున్నారు. బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఇంగితాన్ని ప్రదర్శించడం లేదు. నేతలు ఎవరు కూడా మోడీకి భయపడి ఏమీ మాట్లాడడం లేదు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి ,మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి...వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయవిధానం, ఆహారపంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుం టున్నారు. సమస్యలను ఎత్తి చూపడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. దేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు..విభిన్న ఆహారపు అలవాట్లు ఉన్నందున.. ఏ ధాన్యం ఎక్కడ ఎంత అవసరమో ..దానికి అనుగుణంగా ఏ పంటలు అవసరమో కేంద్రం వద్ద ప్రణాళిక లేదు. సమస్యలపై సమగ్రంగా చర్చించాలన్న స్పృహ విపక్షాలకు లేదు. అధికారపక్షానికి అంతకన్నా శ్రద్ద లేదు. దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తూ.. దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. ఈ సమస్యలపై మోడీ దాటవేత ధోరణితో దేశం తీవ్ర సమస్యను ఎదుర్కోనుంది.

# 10న మాంసం దుకాణాల బంద్

హైదరాబాద్, మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 10న గ్రేటర్‌లోని మాంసం విక్రయాలు జరుపకుండా, దుకాణాలు మూసి వేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పేర్కొంది. ఈమేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది ఆదేశాలు జారీ చేశారు. మటన్, బీఫ్ తదితర మాంసం విక్రయ దుకాణాలు, కబేళాలు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రై పోలీస్ కమిషనర్లకూ సమాచారం అందించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎన్డీఏ సర్కారులో ఏపీకి మరీ ఇంత అన్యాయమా?



న్యూఢిల్లీ,కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏపీకి అన్యాయం చేస్తుందా? అంటే ఓ విషయంలో తీరని అన్యాయమే జరుగుతుందని నవ్యాంధ్ర వాసులు వాపోతున్నారు. 2014 నుంచి దేశాన్ని పాలిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం ఏపీ మెట్రో రైలు ప్రాజెక్టుకు నిధుల విడుదల చేయడంలో జాప్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం మనగడకు ప్రధాన స్తంభంలా నిలిచిన ఏపీకి ఇప్పటికైనా న్యాయం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. కాగితాలకే పరిమితమైన విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.దేశంలో 2014 తర్వాత మెట్రో రైల్ ప్రాజెక్టుల్లో వేగం పెరిగింది. గతంలో కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన మెట్రో రైలు మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించింది. పట్నా, కొచ్చి, భువనేశ్వర్ వంటి నగరాలకు మెట్రో రావడం దీనికి ఉదాహరణగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఏపీలోని విజయవాడ, విశాఖలకు మెట్రో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అయితే పదకొండేళ్లుగా ఈ ప్రాజెక్టులు ప్రతిపాదన దశల్లోనే ఉండిపోవడంపై విచారణ వ్యక్తమవుతోంది. ఈ రెండు నగరాలతో పాటుగా ప్రతిపాదన చేసిన ఇతర నగరాల ప్రాజెక్టులు నిర్మాణాలు పూర్తయ్యే దశకు చేరుకోవడం ఏపీ వాసులను ఆవేదనకు గురిచేస్తోందని చెబుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దక్షిణ భారతదేశంలో మెట్రో రైలు లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచిపోయిందని ఆవేదన చెందుతున్నారు.దక్షిణ భారత్ లో ఐదు ప్రధాన రాష్ట్రాలు ఉండగా, తెలంగాణకు హైదరాబాద్ మెట్రో, తమిళనాడుకు చెన్నై మెట్రో, కేరళకు కొచ్చి మెట్రో, కర్ణాటకకు బెంగళూరు మెట్రో ఉన్నాయి. కానీ, ఏపీకి ఇంతవరకు మెట్రో లేదు. గత పదేళ్లుగా వెనకబడిన మెట్రో ప్రాజెక్టును ఇప్పటికైనా పట్టాలెక్కించాలని డిమాండ్ వినిపిస్తోంది. ఏపీలోని వైజాగ్, విజయవాడ కన్నా చిన్న నగరాలైన బిహార్ రాజధాని పట్నా, ఒడిశా రాజధాని భువనేశ్వర్ కు మెట్రో ఉందని, కానీ, ఏపీలో వయబులిటీ ఉన్న విశాఖ, విజయవాడకు మెట్రో సౌకర్యం లేకపోవడం లోటుగా అభివర్ణిస్తున్నారు. అదేవిధంగా కేరళకు రాజధాని కూడా కాని కొచ్చిలో మెట్రో ఉండటం, ఆ నగరం జనాభా విశాఖ, విజయవాడ కన్నా తక్కువగా ఉండటాన్ని గుర్తు చేస్తున్నా రు. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ కీలక భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి విజయవాడ, విశాఖ మెట్రోకు నిధులు సాధించేలా అడుగులు వేయాలంటున్నారు. పదేళ్లుగా ఊరిస్తున్న విశాఖ, విజయవాడ మెట్రోపై చంద్రబాబుకు ఆసక్తి ఉన్నా, ప్రాజెక్టుకు కనీసం భూ సేకరణ కూడా చేపట్టకపోవడం నిరాశకు గురిచేస్తోందని అంటున్నారు. కాగితాలపై తప్ప మరెక్కడా కనిపించని మెట్రోకు సీఎం చంద్రబాబే దారులు వేయాలనే డిమాండు వినిపిస్తోంది. ప్రస్తుతం విజయవాడ, విశాఖ నగరాల్లో నగర ప్రయాణం నరకంగా మారుతోంది . గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ లతో ప్రజలు విసిగిపోతున్నారు. రాజధాని అమరావతికి పక్కనే ఉన్న విజయవాడలో రద్దీ రోజురోజుకు పెరిగిపోతోంది. దీంతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. దీని నివారణకు మెట్రోయే మార్గమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.2014లోనే ప్రతిపాదించిన మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లోనే స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేసింది. విజయవాడ మెట్రోకు 8 అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపాయి. జర్మనీకి చెందిన బ్యాంకు రుణం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఇక విశాఖ మెట్రో కోసం కొరియన్ బ్యాంకు రుణమిస్తామని చెప్పింది. 2017లో బిడ్డింగ్ దశకు చేరుకున్న విశాఖ మెట్రో ఆ తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదని అంటున్నారు. గత ప్రభుత్వం వీటిపై ఆసక్తి చూపకపోవడంతో ఎటువంటి కదలికకు నోచుకోలేకపోయింది. ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టుల వేగం పెంచాలని డిమాండ్ వినిపిస్తోంది.

# రణ క్షేత్రం దండకారణ్యం.. శాంతి చర్చల కేంద్రం తెలంగాణ!

హైదరాబాద్,చత్తీస్ గఢ్ సహా ఒరిస్సా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర పరిధిలోని దండకారణ్యం(అబూజ్ మడ్) అటవీ ప్రాంతాల పరిధిలో కొనసాగుతున్న మావోయిస్టుల ఏరివేత అపరేషన్ కగార్ మావోయిస్టు పార్టీ విప్లవోద్యమానికి సవాల్ గా మారింది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్ ను సాధిస్తామని హెూంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేస్తున్నారు. దీనికి నిదర్శనమన్నట్లుగా ఇప్పటికే కేంద్ర రాష్ట్ర భద్రత బలగాలు చత్తీస్ గఢ్ సహా సరిహద్దుల రాష్ట్రాల పరిధిలోని దండకారణ్యంలో మావోయిస్టులను దాదాపుగా దిగ్బంధం చేశారు. సుమారు 4వేలకు పైగా సాయుధ భద్రతా బలగాలు మావోయిస్టు నేతల స్థావరంగా పిలిచే దండకారణ్యాన్ని చుట్టుముట్టారు. అత్యాధునిక సాంకేతిక ఆయుధాలు..డ్రోన్లతో వరుస ఎన్ కౌంటర్లు చేస్తూ దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్న భద్రతా దళాలు మావోయిస్టు అగ్రనేతలు దాగిఉన్న ప్రాంతాలవైపు దూసుకెలుతున్నాయి. ప్రతి 3నుంచి 5కిలోమీటర్ల ఒక మిలటరీ క్యాంపులను ఏర్పాటు చేశారు. స్థానిక ఆదివాసి యువకులను సాయుధ భద్రతా దళాల్లో చేర్చుకోవడం ద్వారా స్థానికంగా పట్టు సాధించి కీకారణ్యంలోకి ముందడుగు వేశారు. గడిచిన రెండేళ్ల నుంచి ఏకంగా 400మందికి పైగా సాయుధ మావోయిస్టులను, మిలిటెంట్లను ఎన్ కౌంటర్లలో హతమార్చారు. గత ఏడాది 287మంది వరకు మృతి చెందారు. ఈ ఏడాది మూడు నెలల్లోనే 135మంది హతమయ్యారు. రెండేళ్లలో 1000మందికి పైగా లొంగిపోయారు. ఏడాది కాలంలోనే మావోయిస్టుల సంఖ్య వెయ్యికిపైగా తగ్గిపోయింది. ప్రస్తుతం వారి సంఖ్య వందల్లోనే ఉంటుందని తెలుస్తోంది. చత్తీస్ గఢ్ లోని బీజాపూర్, సుక్మా, బస్తర్ ఎజన్సీ, కాంకేర్ జిల్లాల్లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్లు జోరుగా సాగుతున్నాయి.

తెరపైకి శాంతిచర్చల ప్రతిపాదన

మావోయిస్టుల పెట్టని కోటగా..అగ్రనేతలతో పాటు కేంద్ర..రాష్ట్రాల కమిటీల స్థావరంగా ఉన్న దండకారణ్యాన్ని భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్ తో దిగ్బంధించడం..ఇప్పటికే వందలాది మందిని మట్టుపెట్టాయి. ఇంతకాలం ఏ అడవుల్లో మావోయిస్టులు బలంగా ఉన్నారో..వారికి సేఫ్ జోన్ గా ఉన్నాయో.. అదే అబూజ్ మాడ్ దండకారణ్యం అడవుల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేస్తూ భద్రతా బలగాలు మావోయిస్టుల చుట్టు పద్మవ్యూహాన్ని అమలు చేశాయి. ఛత్తీస్ గఢ్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, సీఆర్పీఎఫ్, కోబ్రా, ఒడిశాకు చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్స్, తెలంగాణ గ్రేహౌండ్స్ సహా అన్ని బలగాలు జాయింట్ ఆపరేషన్స్ తో అత్యాధునిక సాంకేతికత వినియోగంతో అడవులను జల్లెడపడుతున్నాయి. 'ఆపరేషన్ కగార్'లో భాగంగా ప్రతి 5 కిలోమీటర్లకు ఒక బేస్ క్యాంపు ఏర్పాటు చేసి దండకారణ్యంలో సాయుధ భద్రతా బలగాలు చొచ్చుకెలుతున్నాయి. వరుస ఎన్ కౌంటర్లు.. లొంగుబాట్లతో అల్లాడిపోతున్న మావోయిస్టు పార్టీ ముందెన్నడు లేనంత ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోంటుంది. ఈ పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో వెలువడిన శాంతి చర్చల ప్రతిపాదన ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసలు ఇప్పుడే ఎందుకు చర్చల ప్రతిపాదనను ఆకస్మాత్తుగా తెరపైకి తెచ్చారు..దీని వెనుక వారి చిత్తశుద్ధి వ్యూహాలు ఏమిటన్నదానిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయి. చిత్రంగా ప్రభుత్వం వైపు నుంచి రావాల్సిన శాంతిచర్చల ప్రతిపాదన మావోయిస్టు పార్టీ నుంచి వెలువడటమే కాకుండా కాల్పుల విరమణ ప్రతిపాదన కూడా చేశారు. దీంతో శాంతిచర్చల ప్రతిపాదన వెనుక మావోయిస్టుల వ్యూహాలు ఏమిటీ..ప్రభుత్వాలు శాంతిచర్చలకు అంగీకరిస్తాయా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

తెలంగాణ కేంద్రంగా ప్రతిపాదనలా..!?

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ విడుదలు చేసిన శాంతిచర్చల ప్రతిపాదనకు ప్రేరణ తెలంగాణలోని హైదరాబాద్ లో మార్చి 24న నిర్వహించిన శాంతిచర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశమని పేర్కొనడం ఆసక్తి రేపింది. మావోయిస్టులు, పౌరసంఘాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ 2002, 2004లో హైదరాబాద్ వేదికగా శాంతిచర్చలకు చొరవ తీసుకోవడం గమనార్హం. అయితే అప్పట్లో మావోయిస్టు పార్టీ కార్యకలపాలు తెలుగు రాష్ట్రాల్లో జోరుగా ఉండేవి. ప్రస్తుతం వారి ఉనికి కేవలం దండకారణ్యం సరిహద్దు జిల్లా ఉమ్మడి వరంగల్ వంటి వాటికే పరిమితమైంది. రాష్ట్రంలో పెద్దగా మావోయిస్టుల కార్యకలాపాలు లేనప్పటికి దండకారణ్యం పరిధిలో సాగుతున్న మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఆపరేషన్ కగార్ పేరుతో సాగుతున్న యుద్ధాన్ని నివారించేందుకు హైదరాబాద్ నుంచి శాంతిచర్చల చొరవ..ప్రతిపాదనలు వెలువడటం కొంత ఆశ్చర్యకమైనప్పటికి స్వాగతించదగినదే. 2023డిసెంబర్ లో చత్తీస్ గఢ్ బీజేపీ ప్రభుత్వం మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించడం..దండకారణ్య కమిటీ సానుకూలత వ్యక్తం చేయడం జరిగినా..ఆపరేషన్ కగార్ కొనసాగింపుతో చర్చల ప్రక్రియ తెరమరుగైంది.



54సంఘాలతో చర్చల కమిటీ

మావోయిస్టులు, ఆదివాసీల సంహారాన్ని ఆపాలని, శాంతి చర్చలు నిర్వహించాలని మావోయిస్టు కేంద్ర కమిటీ కోరడంతో దేశవ్యాప్తంగా ఉన్న 54 సంఘాలతో హైదరాబాద్ కేంద్రంగా శాంతి చర్చల కమిటీ ఏర్పడింది. చర్చలకు ఛత్తీస్‌గఢ్ సర్కారు సానుకూలంగా స్పందించడాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. కేంద్రం కూడా చర్చలకు ముందడుగు వేయాలని కోరారు.కేంద్రం చొరవ తీసుకుంటే సమస్య తప్పకుండా పరిష్కారమవుతుందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు పేర్కొన్నారు.

అందుకేనా చర్చల ప్రతిపాదన

దేశవ్యాప్తంగా ఉన్న మావోయిస్టు నాయకత్వం అంతా కూడా దండకారణ్యం..అబూజ్ మడ్ అటవీ ప్రాంతంలోనే ఉంటూ ఇక్కడి నుంచే దేశంలో తమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లోని పాతతరంతో పాటు కేంద్ర పార్టీ మావోయిస్టు నాయకత్వం కూడా ఇదే ప్రాంతంలోని ఉంది. మావోయిస్టు పార్టీ పోలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ, దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ సహా ఇతర కమిటీలన్ని చత్తీస్ గఢ్ దండకారణ్యం కేంద్రంగా పనిచేస్తుండటం..పీఎల్ జీఏ దళాలు కూడా అక్కడే ఉండటంతో భద్రత బలగాల భారీ అపరేషన్ మావోయిస్టులకు సంకటంగా మారింది. తెలంగాణ మావోయిస్టుల కమిటీలు కూడా అక్కడే ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం వారికి చేరువగా భద్రతా బలగాలు ముందుకెలుతున్నాయి. అత్యాధునిక ఆయుధాలతో దూసుకొస్తున్న భద్రతాబలగాలను ఎదురించడం కష్టసాధ్యంగా మారడం..స్థావరాలను మార్చి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే దారులను కూడా భద్రతా దళాలు మూసివేయడంతో మావోయిస్టులు ఆత్మరక్షణ వ్యూహంలో పడ్డారు. అటు తమ ఆచూకీ కోసం ఆదివాసీలను భద్రతా దళాలు బలి చేస్తుండం కూడా మావోయిస్టులను ఆలోచింప చేసింది. పెరిగిన నిర్భంధంతో తమతో పాటు తాము ఏ ప్రజల కోసం పోరాడుతున్నామో వారికి ప్రాణనష్టం వాటిల్లుతుండటంతో శాంతిచర్చల ప్రతిపాదనకు ఇది సమయమని మావోయిస్టు పార్టీ భావించిందని విశ్లేషిస్తున్నారు. అయితే భద్రతాదళాలు చుట్టుముట్టిన నేపథ్యంలో మిగిలిన కేడర్ ను రక్షించుకునేందుకు..శాంతి చర్చల సమయంలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోయే ఆలోచనలతోనే వ్యూహాత్మకంగా మావోయిస్టులు శాంతి చర్చల ప్రతిపాదన చేశారని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి.

పట్టించుకోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

మావోయిస్టులు చేసిన శాంతిచర్యల ప్రతిపాదనను కేంద్రంతో పాటు చత్తీస్ గఢ్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆపరేషన్ కగార్ తుది దశకు చేరుకున్న తరుణంలో శాంతిచర్చలతో పెద్దగా లాభముండదని..అదిగాక చర్చల మాటున మావోయిస్టుల సేఫ్ గేమ్ ప్లాన్ ఉందని అనుమానిస్తుంది. అదిగాక కాల్పుల విరమణ..శాంతి చర్చల ప్రతిపాదనకు మావోయిస్టు పార్టీ భద్రతా బలగాలను ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని. కొత్త క్యాంపులు పెట్టరాదని..చర్చల సమయంలో క్యాంపులకే పరిమితం కావాలంటూ షరతు పెట్టింది. దీనికి భద్రతా బలగాలు సిద్ధంగా లేవని తెలుస్తుంది. ఆపరేషన్ కగార్ ఆఖరి దశలో ఉందని..మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకున్న అబూజ్ మడ్ స్థావరాలపై దాడుల సమయంలో చర్చలు అనవసరమని భావిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవేళ చర్చలకు వెళితే అగ్రనేతలు లొంగిపోవాలన్న షరతు పెట్టాలని కగార్ ఆపరేషన్ అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండువైపుల పీటముడులు దాటుకుని శాంతిచర్చలు కార్యరూపం దాల్చడం సందేహంగానే కనిపిస్తుంది.

ఆపరేషన్ కగార్ ఉచ్చులో తెలుగు మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ ఉచ్చులో ఎక్కువగా తెలుగు రాష్ట్రాల వారు ముఖ్యంగా తెలంగాణకు చెందిన మావోయిస్టు నేతలు కూడా ఉన్నారు. చత్తీస్ గఢ్ దండకారణ్యంలో పెరిగిన నిర్భంధంతో కొంతమంది తెలంగాణలోకి ప్రవేశించే క్రమంలో ఏడాది కాలంలో జరిగిన ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. 26మంది వరకు ఏపీ మన్యం జిల్లాల్లో ప్రవేశించినట్లుగా ఇటీవల ఆ రాష్ట్ర పోలీసులు గుర్తించారు. రాష్ట్రానికి చెందిన 90 మంది కేంద్ర కమిటీతో పాటు అనేక కీలక కమిటీల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# పులివెందుల టీడీపీలో నేతల మధ్య వర్గపోరు

కడప, పులివెందుల టిడిపిలో విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి సవిత ముందే నేతలు బాహాబాహీకి దిగారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో పులివెందుల టీడీపీలో విభేదాలు భగ్గు మన్నాయి. పార్టీ ఇన్చార్జ్ బీటెక్ రవి, టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డిల మధ్య చాలాకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో మంగవారం జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఇరువర్గాలకు చెందినవారు బాహా బాహీకి దిగారు. మంత్రి సవిత సమీక్షలో బీటెక్ రవి, రాంగోపాల్ రెడ్డి వర్గీయులు వివాదానికి దిగారు. వేదికపై కూర్చునేందుకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి వెళ్లారు. దీంతో ఆయన వేదికపై ఉండ కూడదని బీటెక్ రవి వర్గీయులు గొడవకు దిగారు. రాంగోపాల్ రెడ్డి కిందికి దిగిపోవాలని నినాదాలు చేశారు. నియోజకవర్గంపై తామే ఆధిపత్యం చెలాయిం చాలని ఇరువర్గాల వారు గొడవకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో సర్వసభ్య సమావేశం యధావిధిగా కొనసాగింది. కాగా రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీని క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు. అందుకే ప్రభుత్వ పాలన, పార్టీ కార్యక్రమాలు రెండింటికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నేతలకు సూచించారు. అయితే పులివెందుల టీడీపీలో నేతల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. టీ-డీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, టీ-డీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వర్గాల మధ్య గత కొద్ది నెలలుగా ఆధిపత్య పోరు జరుగుతోంది. ఇసుక -టె-ండర్లు, రేషన్ డీలర్ల పోస్టుల విషయంలో విభేదాలు బయట పడ్డాయి. ఇసుక -టె-ండర్ల తమ వారికే దక్కాలని, మరెవ్వరికీ ఇసుక టెండర్లు రావొద్దని రవి వర్గీయులు కలక్టరేట్‌లో హడావుడి చేశారు. అది మరకముందే, రేషన్ డీలర్ల పోస్టులు తమ వర్గీయులకే దక్కాలని, మరెవ్వరినీ పరీక్షకు అనుమతించొద్దని రవి వర్గం రాద్దాంతం చేసింది. దీంతో రాంగోపాల్ రెడ్డి, రవి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇలాగైతే పార్టీని సంస్థాగతంగా నిర్మించడం సాధ్యం కాదని టీ-డీపీ కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నేతల మధ్య సఖ్యత లేకపోతే పార్టీ బలోపేతం ఎలా అవుతుందని పలువురు కార్యకర్తలు అంటున్నారు. దీనిపై సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాలని, పులివెందులలో టీడీపీలో నెలకొన్న వర్గ, ఆధిపత్య పోరును చక్కదిద్దాలని అనుకుంటున్నారు.

# మరో మైనస్ మార్క్?

హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, పట్టు మని పదిహేను నెలలు కూడా కాలేదు. ఇంతలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన పట్ల ప్రజల్లో కొంచెం చాలా ఎక్కువగానే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వంలో అసమ్మతి చాప కింద నీరులా వ్యాపిస్తోంది. విపక్షాలు సరే సరి ఆశించిన దాని కంటే ముందే పరిస్థితి తమకు అనుకూలంగా మారుతోందని సంబర పడుతున్నాయి. మరో వంక కాంగ్రెస్ అధిష్టానం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటకు ముందిచ్చిన విలువ ఇవ్వడం లేదు. అందుకు మంత్రివర్గ విస్తరణ అంశాన్ని ఒక ప్రహసనంగా మార్చడమే నిదర్శనంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే ఇటీవల ఢిల్లీలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలను గమనిస్తే ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఫిర్యాదులను కాంగ్రెస్ అధిష్టానం సీరియస్ గా పరిశీలిస్తోందని అంటున్నారు. నిజానికి కాంగ్రెస్ పార్టీలో ఫిర్యాదుల సంస్కృతి కొత్తేమీ కాదు. ముఖ్యమంత్రులపై ఫిర్యాదులు, ముఖ్యనాయకుల మధ్య వివాదాలు కాంగ్రెస్ కల్చర్ లో ఎప్పటినుంచో ఉన్నదే అంటున్నారు. ఒక విధంగా ముఖ్యమంత్రులు తోక జాడించకుండా ఉండేందుకు పక్కలో బల్లెంలా అసమ్మతిని అధిష్టానమే ప్రోత్సహించే కల్చర్ ఇందిరమ్మ రోజుల నుంచీ ఉందని అంటారు. నిజమే కాంగ్రెస్ లో ఈ కల్చర్ ఎప్పటినుంచో ఉన్నదే. అయితే ఇంతవరకు ముఖ్యమంత్రి వ్యతిరేకుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అంతగా పట్టించుకోని అధిష్టానం,ఇప్పుడు కొంచెం సీరియస్ గానే ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్ళినా అధిష్టానం అగ్ర నేతల దర్శనం లభించడం లేదని అంటున్నారు. మరోవంక అధిష్టానం నేతలు, అసమ్మతి నేతలకు పిలిచి మరీ అప్పాయింట్మెంట్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అన్నిటినీ మించి కంచ గచ్చిబౌలి (హెచ్‌సీయూ) భూముల వివాదం, జాతీయ స్థాయిలో పార్టీ ఇమేజ్ ని గట్టిగా దెబ్బ తీసిందని అధిష్టానం భావిస్తోందని అంటున్నారు. ముఖ్యంగా ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు ప్రభుత్వ వాదనలను పూర్తిగా పూర్వ పక్షం చేస్తూ చేసిన వ్యాఖ్యలు, ఇందుకు సంబంధించి జాతీయ మీడియాలో జరుగుతున్న వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ అధిష్టానాన్ని మరింత అలర్ట్ చేసిందని అంటున్నారు. కంచ గచ్చిబౌలి (హెచ్‌సీయూ) భూముల వివాదం రాజకీయమ రంగు పులుముకోవడంతో కాంగ్రెస్ అధిష్టానం సమస్యను సీరియస్ గా తీసుకోవడమే కాకుండా, పరిష్కారాన్నితన చేతుల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోందని అంటున్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఇప్పటికీ,మీడియాలో జరుతున్న ప్రచారం మొత్తం ఫేక్ అనే భావనలోనే ఉన్నారు. ఏఐ ద్వారా కొందరు ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలను సృష్టించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ మేరకు అధికారులు ఇస్తున్న వివరణ ఆధారంగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియా మీద కత్తులు దూస్తున్నారు. శనివారం (ఏప్రిల్ 5) కంచ గచ్చిబౌలి వివాదంపై అధికారులతో నిర్వహించిన సమీక్షలోనూ సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టుకు విజ్ఞప్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరో వంక నిజానిజాలు ఎలా ఉన్నప్పటికీ కంచ గచ్చిబౌలి భూముల వివాదం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఇమేజ్ ని దెబ్బ తీసిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నష్ట నివారణ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి వచ్చిన టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కంచ గచ్చిబౌలి భూముల అంశంపై ముగ్గురు మంత్రులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీతో సచివాలయంలో శనివారం (ఏప్రిల్ 5) సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా అటవీ భూమి అవునా కాదా, గతంలో ఏమి జరిగింది వంటి సాంకేతిక అంశాల జోలికి వెళ్ళకుండా విద్యార్థుల ఆందోళనలు, భూములు చదును చేసే క్రమంలో నెమళ్లు. జింకలు ఇబ్బందికి గురైనట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి సంబంధించి మంత్రుల కమిటీని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అలాగే మంత్రులతో భేటీ అనంతరం ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలతో గాంధీభవన్‌లో ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె కంచ గచ్చిబౌలి భూముల వివాదాన్ని ఎవరికీ నష్టం కలగకుండా పరిష్కరించాలని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచనని స్పష్టం చేశారు. ఈ పరిణామాలను గమనిస్తే కాంగ్రెస్ అధిష్టానం రాజకీయ కోణంలో చూస్తుంటే, ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి ధోరణి అందుకు భిన్నంగా ఉందని అంటున్నారు. మీనాక్షి నటరాజన్ మరి కొందరు నాయకులూ, సంస్థలతోనూ చర్చలు జరిపిన తర్వాత అధిష్టానానికి నివేదిక ఇస్తారని ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటయని అంటున్నారు.

# ట్రంప్ తీరుపై సర్వత్రా నిరసనలు



వాషింగ్టన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై విదేశాల్లోనే కాదు.స్వదేశం లోనూ తీవ్రవిమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాలో పలు నగరాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేసారు. ట్రంప్ తీరుతో దేశీయ ఆర్థిక రంగం కుదేలవుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. అలాగే ప్రపంచ దేశాలపై ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరగడం తోపాటు.. ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని విమర్శలు చెలరేగాయి. భారీగా అసంబద్ధమైన టారిఫ్‌లను విధించి.. ప్రపంచం మొత్తంపై ఆర్థికయుద్ధం ప్రకటించారు. వాణిజ్య భాగస్వామిగా, మార్కెట్‌గా, పెట్టుబడులకు అనుకూలంగా మన దేశంపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా ముందుకువెళుతున్నారని విమర్శలు వస్తున్నాయి. టారిఫ్‌ల పాలసీ పెట్టుబడులు ఆపేలా, వినియోగదారులు వ్యయాలు నిలిపేసేలా, అమెరికా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఇవి సాగుతున్నాయని అక్మెన్ అభిప్రాయపడ్డారు.ఇవి పెడదారి పట్టకుండా చూసుకోవాల్సి ఉంది. ఆర్థికమాంద్యం ప్రమాదం ఉందని జేపీ మోర్గాన్ సీఈవో జెమి డిమోన్ తాజాగా అభిప్రాయపడ్డారు. ఆయన వాటాదారులకు విడుదల చేసిన వార్షిక లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. భారత్ వంటి దేశాలను తన దారిలోకి తెచ్చుకొనేకంటే.. వాటితో సన్నిహిత సంబంధాలను పెంచుకోవాలని ఆయన సూచించారు. ఇక భారత్ వంటి నాన్ అలైన్ దేశాల విషయంలో అమెరికానే స్నేహహస్తం చాచి సన్నిహిత సంబంధాలు ఏర్పర్చుకోవాలన్నారు. కీలక వాణిజ్య భాగస్వాములతో లోతైన వాణిజ్య సంబంధాలు కలిగి ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరంగా మంచిది. అమెరికా కూటమిలో భాగస్వాములు కాకుండా ఉన్న నాన్ అలైన్ దేశాలైన భారత్, బ్రెజిల్ వంటి వాటితో సన్నిహితంగా ఉండాలి. వారికి వాణిజ్యం, పెట్టుబడుల్లో అమెరికా స్నేహహస్తం అందించాలని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విధించిన టారిఫ్‌లు ద్రవ్యోల్బణాన్ని పెంచొచ్చు. అది ఆర్థికమాంద్యానికి దారితీయడానికి చాలా అవకాశాలున్నాయి. ఆర్థిక వ్యవస్థ చెప్పుకోదగ్గ స్థాయిలో కుదుపులకు లోనవుతుంది. ఇందులో పన్ను సంస్కరణలు, డీ రెగ్యులేషన్లకు దారితీయడం సానుకూల అంశాలైతే.. పన్ను, వాణిజ్యయుద్ధం, ఏమాత్రం తగ్గుముఖం పట్టని ద్యవ్రోల్బణం, ఆర్థిక లోటు–, ఆస్తుల విలువల గణనీయంగా పెరగడం, అస్థిరత వంటివి ప్రతికూలాంశాలుగా ఆయన విశ్లేషించారు. పన్నుల పెంపు వల్ల దిగుమతి చేసుకొనే వస్తువులే కాదు.. దేశీయంగా తయారైన వాటి ధరలు కూడా పెరుగుతాయన్నారు. ఇవి స్వల్పకాలం కనపడతాయి. ముఖ్యంగా దేశీయ ఉత్పత్తుల ఇన్‌పుట్ ధరలు, డిమాండ్ రెండూ పెరుగుతాయని వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అతిపెద్ద మద్దతుదారుగా నిలిచిన సంపన్నుడు బిల్ అక్మెన్ కూడా టారిఫ్‌లను తప్పుపట్టారు. ట్రంప్ విధానాలు వాణిజ్య భాగస్వామిగా అమెరికాపై మిత్ర దేశాలకు ఉన్న నమ్మకాన్ని ఇవి దెబ్బతీస్తాయన్నారు. దీనికి ట్రంప్ కార్యవర్గం టారిఫ్‌లను గణించడానికి ఎంచుకొన్న మార్గం కూడా తప్పని వెల్లడించారు. తప్పుడు లెక్కల కారణంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థను కిందకు లాగుతున్నారని మండిపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపార దిగ్గజాల విశ్వాసాన్ని ట్రంప్ కోల్పోయారు. ఆయన్ను నమ్మిన దేశం, ప్రజలు తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటారు. ఇందుకోసం కాదు ఆయనకు ఓటేసిందని గుర్తించాలని హెచ్చరిస్తున్నారు.

# గ్యాస్ ధరలతో అదనపు భారం..పెరుగుతున్న ధరలతో తీవ్ర ప్రభావం



హైదరాబాద్, పెరిగిన పెట్రో,గ్యాస్ ధరలతో వాహనదారులు గొల్లుమంటున్నారు. తెల్లారేసరికి ఎంత పెరుగుతుందో అన్న ఆందోళనలో ఉన్నారు. ఇటీవల పెరిగిన ధరలతో ఒక్కో వాహనదారుడిపై కనీసం 300 వరకు అదనపు భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇవి కాక రవాణారంగంపై పెరుగుదల ప్రభావం పడుతోంది. దీంతో నిత్యావసర ధలరు విపరీతంగా పెరిగాయి. గతంలో మహా అయితే ఏడాదిలో రెండుసార్లు ఇంధనం ధరలు పెరిగేవి. ఇప్పుడేమో తెల్లవారితే ధరల్లో మార్పు కనిపిస్తోంది. అప్పట్లో ధరల పెరుగుదల తెలుసుకుని వినియోగదారులు ముందుగానే పెట్రోల్, డీజల్ పోయించుకునేవారు. ఇప్పుడు ముందు రోజు పెట్రోల్ పోయించుకున్న ధరకు, మరుసటి రోజుకు గమనిస్తే మనకు తెలియకుండానే పైసల్లో పెరుగుతోంది. ఈ పైసలే.. రోజుల వ్యవధిలో రూపాయిల్లోకి చేరుతున్నాయి. పెట్రోల్ నిత్యావసర సరుకులా మారింది. ఈ క్రమంలో పెరుగుతున్న ధరలు భారంగా మారుతున్నాయి. పరోక్ష భారం కూడా ఎక్కువే.పెట్రోల్, డీజల్ ధరలు రోజు వారీగా చూసినప్పుడు పెరుగుదల పైసల్లోనే కనిపిస్తోంది. ప్రత్యక్షంగా వినియోగదారుడిపై దాని ప్రభావం అంతగా కనిపించదు. కానీ, వాటి ధరల పెంపుతో రవాణా ఛార్జీలు, వస్తువుల తయారీపై భారం పడుతోంది. డీజల్ ధర పెరుగు దలతో వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ట్రాక్టరు, హార్వెస్టర్ అద్దె ధరలు పెరిగి పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఇవన్నీ వాహనాల్లేని వినియోగదారులపైనా భారం పడుతున్నాయి. ఇకపోతే తాజాగా వంటగ్యాస్ సిలెండర్లు,పెట్రోల్, డీజిల్ పై వడ్డింపు మొదలైంది. ప్రభుత్వం సోమవారం ఎల్ పిజి ధరను రూ. 50 పెంచింది. ఉజ్వల వినియోగదారులతో పాటు, సాధారణ ప్రజలకూ కూడా గ్యాస్ సిలెండర్ ధర పెరుగుతుంది. అలాగే, పెట్రోలు, డీజిల్ పై ఎక్సైజ్ డ్యూటీని కేం ద్ర ప్రభుత్వం 2 రూపాయలు పెంచింది. కొత్త ధరలు ఏప్రిల్ 8 నుంచే అమలులోకి వచ్చాయి. ఉజ్వల పథకం లబ్దిదారులకు ప్రస్తుతం రూ. 500 గా ఉన్న గ్యాస్ సిలిండర్‌కు ఇక రూ. 550 చెల్లించాలి. అలాగే సాధారణ వినియోగదారులకు ప్రస్తుతం 803 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్‌కు ఇక 853 రూపాయలు చెల్లించాలి. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ప్రస్తుతం గ్యాస్ సిలెండర్‌కు రూ. 855 రూపాయలు చెల్లిస్తున్న వినియోగదారులు ఇక రూ. 905 చెల్లించవలసి ఉంటుంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు ఏటా 43 వేల కోట్ల రూపాయలు నష్టపోతున్న కారణంగానే ఎల్ పిజీ ధరలు పెంచవలసి వచ్చినట్లు కేంద్రమంత్రి హర్దీప్ పురి వివరించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచడం వల్ల రీటైల్ ధరల పై ఎలాంటి ప్రభావం పడదని రెవిన్యూ విభాగం నోటిఫికేషన్ లో పేర్కొంది.

# జనసేనలోకి జక్కంపూడి ఫ్యామిలీ...?



అమరావతి,అవునా నిజమేనా అని రాజకీయాల మీద ఆసక్తి అవగాహన ఉన్న వారు ఆశ్చర్యపడాల్సిందే. ఎందుకంటే దివంగత నేత జక్కంపూడి రామ్మోహన్ రావు వైఎస్సార్ కి ఎంతటి సన్నిహిత నేత అన్నది వేరేగా చెప్పాల్సి లేదు. వైసీపీని జగన్ ఏర్పాటు చేస్తే తొలి జెండా గోదావరి జిల్లాలో పట్టుకున్నది ఆయనే.ఆ తర్వాత ఆయన కుటుంబం మొత్తం వైసీపీకి విధేయులుగా ఉంటూ వచ్చింది. ఆయన సతీమణి జక్కంపూడి విజయలక్ష్మి వైసీపీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేశారు. ఇక జక్కంపూడి ఇద్దరు కుమారులూ వైసీపీలో కీలకంగా ఉంటున్నారు.జక్కంపూడి రాజా 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా రాజానగరం నుంచి గెలిచారు. ఆయన 2024 ఎన్నికల్లో ఓడారు. దానికి కారణం అక్కడ బలంగా జనసేన తిష్ట వేయడమే. జనసేనను వైసీపీలో ఉన్నపుడు ఎంతగానో విమర్శించిన జక్కంపూడి ఫ్యామిలీ చూపు ఇపుడు గాజు గ్లాస్ మీద ఉందా అన్నది చర్చ సాగుతోంది .జక్కంపూడి రాజా సోదరుడు వైసీపీ యువనేత అయిన గణేష్ వైసీపీకి ఇటీవల రాజీనామా చేయబోతున్నారు అనే వార్తలు వస్తున్నాయి . ఆయన మాజీ ఎంపీ వైసీపీ నేత మార్గాని భరత్ తో విభేదాల వల్లనే రాజీనామా చేసినట్లుగా చెబుతున్నా కూడా లోపల వేరే వ్యూహాలతోనే ఈ రాజీనామా జరిగింది అని అంటున్నారుట.రాజమండ్రి ఎంపీగా ఉన్నప్పటి నుంచే మార్గాని భరత్ తో జక్కంపూడి సోదరులకు విభేదాలు ఉన్నాయని చెబుతున్నారు నిజానికి జక్కంపూడి గణేష్ రాజమండ్రి అసెంబ్లీ సీటుని 2024 ఎన్నికల్లో కోరుకున్నారని ప్రచారం సాగింది. అయితే ఎంపీ నుంచి ఎమ్మెల్యేగా షిఫ్ట్ అయిన మార్గాని భరత్ కి జగన్ ఇచ్చారు. దాంతోనే కొంత అసంతృప్తికి ఆ ఫ్యామిలీ గురి అయింది అని అంటున్నారు.వైసీపీకి తమ కుటుంబం కట్టుబడి ఉందని అందువల్ల రెండు అసెంబ్లీ టికెట్లు ఇవ్వలేరా అన్న చర్చ కూడా సాగిందట. ఇక వైసీపీ ఘోర ఓటమి తరువాత రాజాకు రాష్ట్ర వైసీపీ యూత్ వింగ్ బాధ్యతలను జగన్ అప్పగించారు. కానీ మారుతున్న రాజకీయ సమీకరణలు సామాజిక సమీకరణలు గోదావరి జిల్లాలో ఈ కుటుంబం జాగ్రత్తగా గమనిస్తోంది అని అంటున్నా రు.జనసేన బలంగా ఉన్న చోట ఎదురీతను జక్కంపూడి ఫ్యామిలీ గుర్తించిందా అన్న చర్చ కూడా ఉంది. అయితే అన్న దమ్ముల మధ్య కొంచెం గ్యాప్ ఉంది అంటున్నారు .. అన్న రాజా ఏమో వైస్సార్సీపీ లోనే ఉందాం..జనసేన వద్దు అని అంటున్నారు అని తెలుస్తుంది .. కానీ తమ్ముడు జనసేన ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది . కేరాఫ్ వైసీపీగా బలమైన ముద్ర ఉన్న జక్కంపూడి ఫ్యామిలీ ఇప్పట్లో అయితే జనసేన వైపు వెళ్ళదని అంటున్నారు ముందుగా గణేష్ ఎమన్నా జనసేన వైపు స్టెప్ తీసుకుంటారా అనే చర్చ గోదావరి జిల్లాలో వినిపిస్తుంది.ఇక 2029 ఎన్నికల నాటికి రాజకీయం చూసుకుని మొత్తం ఫ్యామిలీ జంప్ చేస్తారు అని పుకార్లు షికారు చేస్తున్నాయి. జగన్ అంటే ప్రాణం పెట్టే జక్కంపూడి ఫ్యామిలీ అలా చేస్తుందా అంటే ఏమో ఇది రాజకీయం కాబట్టి ఏమైనా జరగవచ్చు అన్న వాదన కూడా ఉంది. చూడాలి మరి ఈ పుకార్లు ఏమవుతాయో ఏమిటో.

# జగన్ పై రెచ్చిపోయిన పరిటాల సునీత



అమరావతి,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన రాజకీయ వేడి రాజేసింది. ఇప్పటికే మంచి కాకమీదున్న రాప్తాడు రాజకీయం జగన్ పర్యటనతో మరింత హీటెక్కింది. హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన వైసీపీ అధినేత జేజేలు కొట్టించుకోవడంపై సిట్టింగ్ ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్ అవుతున్నారు. మాజీ సీఎం జగన్ చావు పరామర్శకు వచ్చారా? ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారా? అంటూ దౌటు పడిన సునీత, చావు ఇంట జేజేలు కొట్టించుకోవడమేంటి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నీ చుట్టూ ఉన్న వాళ్లుఆ కుటుంబాన్ని చూసి నవ్వుతున్నారు. నువ్వు నవ్వుతున్నావో.. ఏడుస్తున్నావో అర్థం కావడం లేదంటూ సునీత సెటైర్లు వేయడం వైరల్ అవుతోంది.రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో మంగళవారం మాజీ సీఎం జగన్ పర్యటించారు. ఈ పర్యటనకు ముందు నుంచి స్థానికంగా టీడీపీ, వైసీపీ మధ్య డైలాగ్ వార్ నడుస్తున్న విషయం తెలిసిందే. వైసీపీ కార్యకర్త హత్య తర్వాత.. ఎమ్మెల్యే పరిటాల సునీతపై వైసీపీ తీవ్ర విమర్శలు చేసింది. అయితే వైసీపీకి కౌంటరుగా తన భర్త, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర హత్యతో జగన్ కు సంబంధం ఉందంటూ పరిటాల సునీత ఆరోపించడం పెద్ద చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సైతం ఎమ్మెల్యే సునీత టార్గెట్ గా విమర్శలు గుప్పించారు. ఇక ఈ హైటెన్షన్ వాతావరణంలోనే రాప్తాడులో అడుగుపెట్టిన మాజీ సీఎం జగన్.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ ఆరోపణలకు కౌంటరుగా మాట్లాడిన ఎమ్మెల్యే సునీత తాను తలుచుకుంటే మాజీ సీఎం జగన్ రాప్తాడులో అడుగు పెట్టలేరంటూ హెచ్చరించడం గమనార్హం.తనను తన కుమారుడిని టార్గెట్ చేయడానికే మాజీ సీఎం జగన్ రాప్తాడు పర్యటనకు వచ్చారని ఎమ్మెల్యే సునీత ఆరోపించారు. జగన్ మాట్లాడినవన్నీ అసత్యాలు, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి రాసిచ్చిన స్క్రిప్టును యథావిధిగా చదివేశామంటూ ఆరోపించారు. పరీక్షల్లో చూసి రాసినట్లు ఎవరో రాసిచ్చింది చదువుతున్న జగన్ ప్రశాంత పల్లెల్లో చిచ్చు పెట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పాపిరెడ్డిపల్లెలో అనుకోని సంఘటన జరిగిందని లింగమయ్య హత్యపై వివరణ ఇచ్చిన ఎమ్మెల్యే.. పులివెందుల నియోజకవర్గంలో పోలింగు బూతుల్లో కొడవళ్లు పట్టుకుని చంపుతారని ఆరోపించారు. మీ చిన్నాన్నను చంపితే న్యాయం చేయమని అడిగిన చెల్లికి న్యాయం చేయలేదు. చెల్లికి న్యాయం చేయలేని నువ్వు ఇక్కడికి వచ్చి ఏం చేస్తావంటూ జగన్ ను ప్రశ్నించారు సునీత. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని నువ్వు, లింగమయ్య కుటుంబానికి ఏం న్యాయం చేస్తావంటూ నిలదీశారు.మాజీ సీఎం అయివుండి ఓ ఎస్ఐ గురించి నీచంగా మాట్లాడుతున్నావు. పోలీసుల గుడ్డలు ఊడదీస్తానని చెబుతున్నావు.. జగన్ వ్యాఖ్యలపై జిల్లా ఎస్పీతోపాటు పోలీసు అధికారుల సంఘం స్పందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఎస్ఐ మాకు ఫోన్ చేయించాడని బైబిల్ పై ప్రమాణం చేసి చెప్పాలంటూ సునీత సవాల్ విసిరారు. మేము భవగద్గీత మీద ప్రమాణం చేస్తామని వ్యాఖ్యానించారు.

### విచారణకు సహకరించండి

హైదరాబాద్,కంచె గచ్చిబౌలి భూముల విషయంలో నకిలీ వీడియోల ప్రసారంపై విచారణకు సహకరించాలని భారాస నేత మన్నె క్రిశాంక్ ను హైకోర్టు ఆదేశించింది. ఆయన పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల ఘటనలో నకిలీ వీడియోలు వైరల్ చేశారని పోలీసుల ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. విచారణకు సహకరించాలని ఆయనను ఆదేశించింది. కొంతం దిలీప్‌నకు నోటీ–సులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించి.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఒకే ఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వెల్లడించారు.

# ఏపీలో అండర్ గ్రౌండ్ న్యూక్లియర్ సబ్ మెరైన్ బేస్



సెంట్రల్ డెస్క్, బంగ్లాదేశ్ చికెన్ నెక్ సమీపంలో వైమానిక స్థావరాన్ని ఏర్పాటుచేసుకుని నకరాలు పోతున్న డ్రాగన్‌ను చిత్తు చేసేందుకు భారత్ సర్వ సన్నద్ధమవుతోంది. భారతదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ అణు జలాంతర్గామి కోటను నిర్మించనుంది. తూర్పు నౌకాదళ కేంద్రం విశాఖపట్టణానికి దక్షిణంగా సుమారు 50 కిలోమీటర్ల దూరంలోని రాంబిల్లి గ్రామం అంతర్జాతీయ యుద్ధ నౌకస్థావరంగా అవతరిస్తోంది. ఇక్కడ భారత అణు జలాంతర్గాములు, యుద్ధనౌకలకు ఓ స్థావరాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇక పశ్చిమ తీరంలో కర్నాటకలోని కార్వార్ నౌకా స్థావరం విస్తరణ పనులు కూడా స్పీడందుకున్నాయి. సముద్ర రక్షణ వలయ సామర్థ్యాన్ని పెంచే దిశలో మరో అడుగు ఊపందుకుంది. తూర్పు తీరంలో రక్షణ అవసరాల కోసం నిర్మిస్తున్న నేవీ ప్రత్యామ్నాయ స్థావరం ఐఎన్ఎస్ వర్షను 2026లో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది పూర్తిగా వ్యూహాత్మక స్థావరం.

ప్రత్యామ్నాయ నేవీ స్తావరం..

అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి సముద్ర తీరాన్ని ఆనుకొని నేవీ ప్రత్యామ్నాయ స్థావరం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం 670 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించింది. ఇక.. ఏపీ ప్రభుత్వం కూడా భూసేకరణలో సహరించింది. ఈప్రాజెక్టు తొలి దశ 2022 నాటికి, మలి దశ నిర్మాణం 2025 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే.. కొవిడ్ కారణంగా ఆలస్యమైంది. ప్రస్తుతం తొలి దశ నిర్మాణం పూర్తి కావొచ్చింది. అచ్యుతాపురంలో బాబా అటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) నుంచి ఐఎన్ఎస్ వర్షకు సంపూర్ణ సహకారం అందుతోంది. అచ్యుతాపురంలో ఈ అటామిక్ రిసెర్చ్ సెంటర్‌కు 2,200 ఎకరాలు కేటాయించారు.

రిపేర్లు, నిర్వహణ అంతా ఇక్కడే..

రాంబిల్లి స్థావరంలో అణు జలాంతర్గాముల నిర్మాణమే కాకుండా.. మరమ్మతులు, నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. ఈ కేంద్రంలో బంకర్లు, సొరంగ వ్యవస్థలు, ఇన్నర్, ఔటర్ హార్బర్ వంటి సౌకర్యాలున్నాయి. హైసెక్యూరిటీతో ఏర్పాటు చేస్తున్న ఈ వ్యూహాత్మక స్థావరం బంగాళాఖాతం, హిందూమహాసముద్ర ప్రాంతంలోని జలాల్లో నిఘాను పెంచనుంది. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా చర్యలను పసిగట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

సబ్ మెరైన్ హబ్‌గా రాంబిల్లి..

శత్రువుల కంట పడని రీతిలో యుద్ధనౌక స్థావరాలను ఇప్పటి వరకూ రష్యా, చైనా మాత్రమే నిర్మించుకున్నాయి. ఆ కోవలోనే భారత్ కూడా రాంబిల్లి (ఐఎన్ఎస్ వర్ష)ను వ్యూహాత్మక స్థావరంగా ఎంచుకుంది. చైనాకు దీటైన సమాధానం చెప్పడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇది భారత నౌకాదళానికి సబ్‌మెరైన్ల హబ్‌గా ఉంటుంది. ఇక్కడ 12 సబ్‌మెరైన్లను లంగరు వేసుకోవచ్చు. అందులో అణు జలాంతర్గాములకే అధిక ప్రాధాన్యం. హైనాన్ ద్వీపంలో చైనా అణు జలాంతర్గామి స్థావరం తరహాలోనే.. రాంబిల్లిలో సముద్రం నీటి లోతు ఎక్కువగా ఉంటుంది. దీంతో జలాంతర్గాములు ఉపగ్రహాల కంటపడే అవకాశాలు ఉండవు. సునాయశంగా నీటిలోకి చేరుకుంటాయి. బయటకు వెళ్లగలవు. వీటిని ఉపగ్రహాలు గానీ, నిఘా విమానాలు గానీ కనిపెట్టే చాన్స్ ఉండదు. సముద్రంలో టన్నెళ్ల గుండా సబ్‌మెరైన్లు హబ్‌కు చేరుకునేలా ఈ నిర్మాణం చేశారు. దీనికి పదేళ్లకుపైగా పట్టింది. 2014 ఆగస్టులో ఇక్కడ స్థావరాన్ని నిర్మిస్తున్నట్టు వార్తలు వెలువడ్డాయి.

అరిహంత్.. అరిఘాత్ దూకుడు..

విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 2004 నుంచి న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణం జరుగుతోంది. స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్స్ (ఎస్ఎస్‌బీఎన్) పేరుతో నాలుగు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసల్ (ఏటీవీ) ప్రాజెక్టును 2004లో ప్రారంభించారు. ఇందులో మొదటిది అరిహంత్ . దీని నిర్మాణానికి రష్యా సహకారం తీసుకున్నారు. 2009లో జల ప్రవేశం చేశారు. అనేక ట్రయల్స్ అనంతరం 2016 ఆగస్టులో నేవీకి అప్పగించారు. ఇక రెండోది ఐఎన్ఎస్ అరిఘాత్. 2017లో ట్రయల్స్ వేశారు. 2024 ఆగస్టు 29న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. వీటిని అరిహంత్ క్లాస్ అణు జలాంతర్గాములుగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో మిగిలిన రెండు సబ్‌మెరైన్ల నిర్మాణానికి ?40 వేల కోట్లు ఇవ్వనున్నట్టు ఆరు నెలల కిందట కేంద్ర హోం శాఖ ప్రకటించింది.

అదే బాటలో అర్థమాన్ ..

సబ్ మెరైన్ ప్రాజెక్టులో నిర్మిస్తున్న మూడో న్యూక్లియర్ సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ అర్థమాన్. ఇది గతేడాది (2024) అక్టోబరులోనే సీ ట్రయల్స్‌కు వెళ్లింది. దీన్ని త్వరలో కమిషనింగ్ చేసి నేవీకి అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ కంటే అర్థమాన్ పెద్దది. 7వేల టన్నుల సామర్థ్యం కలిగిన ఈ సబ్‌మెరైన్.. 3,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. మరిన్ని కే –4 క్షిపణులను మోసుకెళ్తుంది. దీని తర్వాత నిర్మిస్తున్న న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను ప్రాజెక్ట్ ఎస్ –4 గా వ్యవహరిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇది కూడా నిర్మాణం పూర్తి చేసుకొని సీ ట్రయల్స్‌లో ఉంది.

పశ్చిమలో కార్వార్.. తూర్పులో వర్ష

ప్రాజెక్ట్ సీబర్డ్‌లో భాగంగా కర్నాటకలోని కార్వార్ స్థావరం పశ్చిమ తీరాన్ని కాపాడుతోంది. ఇదే తరహాలో రాంబిల్లిలో ప్రాజెక్ట్ వర్ష తూర్పు తీరానికి రక్షణగా పహారా కాస్తుంది. కార్వార్ నౌకాదళ స్థావరంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇటీవల పలు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ప్రారంభించారు. తాజా పరిణామాలతో ఈ స్థావరంలో 32 నౌకలు, సబ్‌మెరైన్‌లతోపాటు మరికొన్ని నౌకలు అందుబాటులోకి రానున్నాయి. హైనన్ దీవిలో చైనా అణు జలాంతర్గాముల స్థావరం మాదిరిగా రాంబిల్లి నౌకా స్థావరం కూడా ఉపగ్రహాలకు దొరకదు. లోతైన జలాల్లో సబ్ మెరైన్ల రాకపోకలకు ఇది అనువైన ప్రాంతం. గుట్టుగా ఖండాంతర క్షిపణులను మోసుకెళ్లడానికి న్యూక్లియర్ సబ్మెరైన్లకు ఇది తప్పనిసరి. ఇప్పటికే ఇన్నర్ హార్బర్ సిద్ధమైంది. ఔటర్ హార్బర్ పనులు శరవేగంగా సాగుతున్నట్టు సమాచారం. ఏడు వేల టన్నుల అరిహంత్ క్లాస్ అణు జలాంతర్గామి (ఎస్ఎస్బీఎన్– షిప్,

# సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధునికత..



హైదరాబాద్,రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా సేవలు అందించేందుకు సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధునీకరణ కొనసాగుతున్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఇందులో భాగంగా, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండా, కేవలం 10–15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నామని ప్రకటించారు. మొదటి దశగా రాష్ట్రంలోని 144 సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 22 కార్యాలయాల్లో ఈ విధానం ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రానుంది. హైదరాబాదులో ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట వంటి ప్రాంతాల్లో ప్రారంభించనున్నారు.ఒకేసారి ఎక్కువ దస్తావేజులు సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించేందుకు ప్రతి కార్యాలయంలో పని వేళలను 48 స్లాట్లుగా విభజించారు. ప్రజలు registration.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని, నిర్ణీత సమయంలో హాజరై రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు. అత్యవసరంగా రాబోయే వారికి ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఐదు వాక్–ఇన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటుంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అధిక రద్దీ ఉన్న కార్యాలయాలకు అదనపు సబ్–రిజిస్ట్రార్లను నియమించనున్నట్లు మంత్రి తెలిపారు. ఉదాహరణగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్–రిజిస్ట్రార్లు నియమించబడ్డారు. తద్వారా అక్కడ 144 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. పని భారాన్ని సమతుల్యం చేయడం కోసం, అధిక రద్దీ ఉన్న మరియు తక్కువ రద్దీ ఉన్న కార్యాలయాల పరిధిని సమీక్షించి విలీనం చేస్తామని, మొదటగా చంపాపేట – సరూర్ నగర్ కార్యాలయాలను విలీనం చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com